మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 19-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 290 Issue: 290

19 ఏప్రిల్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:29 తిథి విదియ ఉ. 10:49 వరకు తరువాత తదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం భరణి ఉ. 7:09 వరకు తరువాత రోహిణి యోగం ఆయుష్మాన్ రా. 8:01 వరకు కరణం కౌలవ ఉ. 10:49 వరకు తైతుల రా. 9:09 వరకు వర్జ్యం సా. 5:53 నుండి రా. 7:19 వరకు దుర్ముహూర్తం సా. 4:49 నుండి సా. 5:39 వరకు రాహుకాలం సా. 4:56 నుండి సా. 6:29 వరకు యమగండం మ. 12:15 నుండి మ. 1:48 వరకు గుళికాకాలం మ. 3:22 నుండి సా. 4:56 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు రా. 2:26 నుండి తె. 3:51 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:40 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



# తల్లీ.. క్షమించు!

## మహిళలకు క్షమాపణ చెప్తున్నా: ప్రధాని మోదీ

**విపక్షాల వల్లే స్త్రీల కలలు నాశనం**

**కాంగ్రెస్ పార్టీది భ్రూణ హత్య**

**ఇందుకు ఆ పార్టీకి శిక్ష తప్పదు**

**జాతినుద్దేశించి ప్రధాని మోదీ**



'మహిళలకు నేను క్షమాపణలు చెబుతున్నాను. మహిళా రిజర్వేషన్లను అడ్డుకునేందుకు విపక్షాలు ఎలా ప్రవర్తించాయో దేశం మొత్తం చూసింది. బిల్లును వ్యతిరేకించి విపక్షాలు తప్పు చేశాయి. మహిళా రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నాం. భారత మహిళల కలలను నాశనం చేశారు. దేశహితమే మాకు ముఖ్యం' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి శనివారం ప్రసంగించారు.

న్యూఢిల్లీ:'కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే పార్టీలన్నీ మహిళలకు వ్యతిరేకం. నారీశక్తి ఎదగకుండా అడ్డుకున్నాయని మోదీ ఆరోపించారు. 40 ఏళ్లుగా మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న పాపం విపక్షాలను వదిలిపెట్టదు. కొందరికి దేశం కంటే రాజకీయమే ముఖ్యం. విపక్షాలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. పాపం చేసిన విపక్షాలకు శిక్ష తప్పదు. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం విపక్షాలకు ఇష్టం లేదు. మహిళా బిల్లును అడ్డుకుని భ్రూణహత్యకు పాల్పడ్డాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును గర్భంలోనే చంపేశారు. ఈ భ్రూణ హత్యలకు కాంగ్రెస్ పార్టీకి శిక్ష తప్పదు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోవాల్సిందే. మహిళలకు అన్యాయం చేశారు. మహిళా తరువాయి 2 వ పేజీలో...



## వర్షాకాలంలో ఎన్నికల వేడి

**వేసవి తర్వాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు**

**త్వరలో భూముల ధరలు పెంపు**

**మంత్రి పొంగులేటి వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): త్వరలో భూముల ధరలు పెంచేందుకు కసరత్తు జరుగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ల్యాండ్ వ్యాల్యూ పెంచలేదని ఆయన గుర్తు చేశారు. ధరణి సమస్యలు భూ-భారతితో పరిష్కారం అవుతాయన్నారు. భూముల రిజిస్ట్రేషన్ మ్యాప్‌తో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం తరువాయి 2 వ పేజీలో...



## డిజిటల్ 'హెల్త్'

**రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డు**

**దామోదర్ రాజనర్సింహ వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, కార్డులు అందించబోతున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతరువాయి 2 వ పేజీలో...



## సెకండియర్‌లోనూ ఇంప్రూవ్‌మెంట్

**ఏపీ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం**

విజయవాడ, ఏప్రిల్ 18 (ఈవార్తలు): ఇంటర్ విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇకపై ఇంటర్మీడి యట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైతం ఇంప్రూవ్‌మెంట్ -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,420 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,201 |

## చంద్రబాబు మరో షిండే

**బీజేపీతో పొత్తు మనుగడే ప్రశ్న**

**సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**

దేశంలో బీజేపీతో పొత్తుపెట్టుకున్న పార్టీల మనగడ ప్రశ్నార్థకమే.. అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో నితీష్ కుమార్, మహారాష్ట్రలో ఎక్‌నాథ్ షిండే పరిస్థితి చూస్తూనే ఉన్నామని.. రేపు టీడీడీ, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందంటూ పేర్కొన్నారు.

న్యూఢిల్లీ: ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి సీట్లు తక్కువగా ఉన్నాయని, అందుకే టీడీపీకి ప్రాధాన్యం ఇస్తున్నారని.. భవిష్యత్‌లో బీజేపీ బలం పెరిగితే టీడీపీని పక్కనపెడతారని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. లోక్‌సభ, రాజ్యసభ తరువాయి 2 వ పేజీలో...



## జాతికి విపక్షాల ద్రోహం

**రిజర్వేషన్ బిల్లును అడ్డుకొని తప్పు చేశాయి**

**ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు**



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిరసన ర్యాలీ చేపట్టాయి. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్రోహమంటూ నేతలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ ర్యాలీలో కూటమి నేతలు మాధవ్, కందుల దుర్గేశ్, సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు, ఏప్రిల్ 18 (ఈవార్తలు): ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'రిజర్వేషన్లు వస్తాయని మహిళలు ఆశపడ్డారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్, మిత్ర పక్షాలు మహిళా బిల్లును అడ్డుకున్నాయి. మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహం. మహిళలను గౌరవించి.. అన్ని రంగాల్లో ఆదరించడం మన సంస్కృతి. సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ద్రోహం చేశారు. ఇది ప్రారంభం మాత్రమే. మహిళా లోకమంతా ఏకమైంది. చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయి. దక్షిణాది, తరువాయి 2 వ పేజీలో...

## 20న రెండో విడత 'భరోసా'



**భూపాలపల్లి జిల్లాలో విడుదల చేయనున్న సీఎం**

**45,11,947 మంది రైతులకు 5,653 కోట్ల నిధులు**

తెలంగాణలోని రైతులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధుల విడుదలకు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పటికే తొలి విడత రైతు భరోసా నిధులు విడుదల చేయగా.. తాజాగా రెండో విడత ఎప్పుడు విడుదల చేస్తారు అనేది ప్రకటించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): ఈనెల 20వ తేదీన రెండో విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపింది. ఆ రోజున భూపాలపల్లి జిల్లా కాటారంలో నిర్వహించనున్న బహిరంగ సభ వేదిక నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఇక రైతు భరోసా రెండో విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45,11,947 మంది రైతులకు -2 వ పేజీలో...

## హైదరాబాద్‌లో 'ట్యాంకర్' బతుకులు

**18 రోజుల్లో 2.83 లక్షల ట్యాంకర్ బుకింగ్స్.. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): అత్యధిక జనాభా, బహుళా అంతస్తుల భవనాలు ఉన్న ఏరియాలైన ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, అయ్యప్ప సొసైటీ, మాదాపూర్, మణికొండ, కూకట్ పల్లి డివిజన్ లలోనే అత్యధికంగా ట్యాంకర్లు బుకింగ్ అవుతున్నాయని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. శనివారం ఖైరతాబాద్ లోని జలమండలి బోర్డు కార్యాలయంలో -2 వ పేజీలో...






## 9 మంది ఐపీఎస్‌ల బదిలీ

9 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): మొత్తం 9 మంది ఐపీఎస్ అధికారులకు కొత్త పోస్టింగ్‌లు కల్పిస్తూ, పాలనాపరమైన అవసరాల దృష్ట్యా ఈ మార్పులు చేసినట్లుగా పేర్కొన్నారు. ప్రధానంగా ఏఎస్పీ స్థాయి అధికారులను వివిధ జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా నియమించారు. ఈ బదిలీల్లో భాగంగా, అసిఫాబాద్ ఏఎస్పీగా ఉన్న ఎస్. చిత్తరంజన్‌ను అదే జిల్లాకు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




మనిషి మెదడులోని 1 క్యూబిక్ మిల్లీమీటర్ మెదడు కణజాలాన్ని విశ్లేషించిన అధ్యయనాల్లో, పరిశోధకులు వేలాది న్యూరాన్లు, కోట్ల సినాప్టిక్ సంబంధాలను గుర్తించారు. ఇసుక రేణువు పరిమాణంలో ఉన్న ఈ చిన్న వాల్యూమ్‌లో సుమారు 57,000 కణాలు, 150 మిలియన్ సినాప్సలు (న్యూరాన్ల మధ్య సంబంధాలు), 230 మిల్లీమీటర్ల రక్తనాళాలు ఉన్నట్లు హార్వర్డ్ యూనివర్శిటీ, గూగుల్ రిసెర్చ్ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఇది సుమారు 1,400 టెరాబైట్ల డేటాను ఉత్పత్తి చేస్తుందట.



## కెరమెరిలో 44.6 డిగ్రీలు

**తెలంగాణలో మండుతున్న ఎండలు**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని -2 వ పేజీలో...



## భారత నౌకలపై ఇరాన్ దాడి
## హర్మూజ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

టెహ్రాన్: హర్మూజ్ జలసంధి వద్ద మరోసారి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరాన్ తీరం మీదుగా ప్రయాణిస్తున్న రెండు భారతీయ నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ కాల్పులు జరిపినట్లుగా ఆ దేశ మీడియా వెల్లడించింది. ఇరాక్ తరువాయి 2 వ పేజీలో...

## ట్రంప్‌కు ఓటమి రుచి చూపిస్తాం: మొజ్తాబా

హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. శత్రువులను ఓడించడానికి తమ దేశ నౌకలు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించారు. ప్రస్తుతం ఇరాన్ అమెరికా మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్రంప్ -2 వ పేజీలో...



# రాశి ఫలాలు

19.4.2026

మేషం: మిత్రుల నుండి కొంత ఆసక్తి సమాచారం అందుతుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు.

వృషభం: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆదాయమార్గాలు పెరుగుతాయి. నూతన వస్తు లాభాలు పొందుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వ్యాపార ఉద్యోగాలలో సకాలంలో నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మిధునం: నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఆప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను అధిగమిస్తారు.

కర్కాటకం: దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల నుండి అవసరానికి సహాయం అందక ఇబ్బంది పడతారు. పాత ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార వ్యవహారాలలో ఒడిదుడుకులు తప్పవు. వృత్తి ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

సింహం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపారాలలో శ్రమ అధికమవుతుంది. రావలసిన ధనం సకాలంలో అందక నిరాశ కలుగుతుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది.

కన్య: సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో నూతన ఆలోచనలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. స్థిరాస్తి క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఉపయోగపడతాయి. వృత్తి ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

తుల: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమౌతాయి. బంధు మిత్రులతో వివాదాలు తీరుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృశ్చికం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు పెరుగుతాయి. ధన పరంగా ఒడిదుడుకులు అధికమౌతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. ఉద్యోగపరంగా చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక మానసిక సమస్యలు కలుగుతాయి.

ధనస్సు: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ప్రశాంతత కోసం దైవదర్శనం చేసుకోవడం మంచిది. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: సమాజంలో పెద్దల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కొన్ని వివాదాలకు సంబంధించి సన్నిహితులు నుండి కీలక సమాచారం అందుతుంది. నూతన వస్తు లాభాలు పొందుతారు. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: బంధు మిత్రుల మాటలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. అధిక శ్రమతో గాని పనులు పూర్తి కావు. ఇంటాబయట పరిస్థితులు వ్యతిరేకంగా ఉంటాయి. ఉదర సంబంధిత అనారోగ్య సమస్యలు కలిగే సూచనలున్నవి. ఉద్యోగాలలో అధికారులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు.

మీనం: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలను ఆచరణలో పెడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది.

# తల్లీ.. క్షమించు!

మొదటి పేజీ తరువాయి

బిల్లును ఓడించి కొట్టిన చప్పట్లు.. మహిళలకు చేసిన గాయాలు. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ సమాజ్ వాదీ పార్టీ నిజస్వరూపం బయటపడింది. కాంగ్రెస్ తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుంటుందని భావించా. కానీ మహిళలకు న్యాయం చేసే అవకాశాన్ని జారవిడుచుకుంది. మిత్రపక్షాలపై ఆధారపడి కాంగ్రెస్ పార్టీ బతుకుతుంది. ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ప్రకారమే నియోజకవర్గాలను పెంచాలని ప్రతిపాదించా. ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలలో నియోజకవర్గాలు పెరిగి ఎక్కువ మందికి అవకాశాలు వచ్చేవి. కానీ, డీఎంకే, టీఎంసీ, కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నాయి. డీలిమిటేషన్‌పై దుష్ప్రచారం చేశాయి. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికి నష్టం ఉండదని మేము పదే పదే హామీ ఇచ్చాం. దీనివల్ల అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి. తద్వారా అన్ని పార్టీలకు రాజకీయ ప్రయోజనం ఉంటుంది. కానీ మార్పును వ్యతిరేకించడమే కాంగ్రెస్ సిద్ధాంతం. ఈ బిల్లును అడ్డుకోవద్దని, కావాలంటే ఈ ఘనతను మీరే తీసుకోండని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేసినా వారు పెడచెవిన పెట్టారు. ఇవాళ మాకు సంఖ్యాబలం తక్కువగా ఉండొచ్చు. కానీ మహిళా రిజర్వేషన్ సాధన కోసం మా పోరాటం ఆగదు. చట్టసభల్లోకి రావాలన్న మహిళల కలలను ధ్వంసం చేసిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు రాబోయే ఎన్నికల్లో దేశ మహిళలు గట్టిగా



బుద్ధి చెబుతారు. వారు ఇప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి' అని తెలిపారు. సంస్కరణలను అడ్డుకోవడమే కాంగ్రెస్ నైజమని ప్రధాని ఎద్దేవా చేశారు. గతంలో పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి అంశాలను కూడా కాంగ్రెస్ ఇలాగే వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ఉగ్రవాదం, నక్సలిజం విషయంలో కూడా ఆ పార్టీది నెగెటివ్ వైఖరి అని, వారి విధానాల వల్ల దేశానికి తీవ్ర నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మహిళా లోకం అంతా నేడు దుఃఖంలో ఉంది. తమ హక్కులను అడ్డుకున్న కుటుంబ పార్టీలకు రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మహిళలే గట్టిగా బుద్ధి చెప్పాలి. భారత నారీ శక్తిని తక్కువగా అంచనా వేయకండి.. తస్మాత్ జాగ్రత్త!' అంటూ ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని ముగించారు.

# వర్షాకాలంలో ఎన్నికల వేడి

మొదటి పేజీ తరువాయి

అవుతాయన్నారు. మ్యాప్ తో కూడిన ఫస్ట్ రిజిస్ట్రేషన్ పాలేరులో జరుగుతుందన్నారు. రెవెన్యూలో కొత్త పాలసీ తేబోతున్నామని, అందుకు కసరత్తు జరుగుతోందని వెల్లడించారు. క్యాబినెట్ విస్తరణపై చర్చ ఉందన్నారు మంత్రి పొంగులేటి. విడతల వారీగా జరగడం కొత్తేమీ కాదన్నారు. శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజం అన్న ఆయన.. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని తేల్చి చెప్పారు. ఇక, నామినేటెడ్ పోస్టుల భర్తీ త్వరలోనే ఉంటుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపైనా మంత్రి పొంగులేటి స్పందించారు. సమ్మర్ అయ్యాకే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగవచ్చన్నారు. అసైన్డ్ భూములపై ఎక్కువ కంప్లైంట్స్ ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్ని మంత్రి చెప్పారు. నాలుగు రకాల కంప్లైంట్స్ ను పరిష్కరించేందుకు అధికారులను ఇప్పటికే ఆదేశించామన్నారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం దాడి చేసినప్పుడు మంత్రులు మద్దతుగా నిలిచారని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రతిపక్షం ట్రాప్ లో నేను పడను, అందుకే ఎంత విమర్శించినా ఓపిగ్గా ఉండి సమాధానం చెప్పానని మంత్రి పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమ పనుల లిస్ట్ తయారవుతోందని తెలిపారు. సరైన సమయంలో అన్నీ బయటకు వస్తాయన్నారు.

## 9 మంది ఐపీఎస్‌ల బదిలీ

మొదటి పేజీ తరువాయి

నియమించారు. కామారెడ్డి ఏఎస్పీగా ఉన్న బొక్క చైతన్య రెడ్డిని సంగారెడ్డి అదనపు ఎస్పీగా, జనగామ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పందేరే చేతన్ నితిన్‌ను జగిత్యాల అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. అలాగే భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను మెదక్ అదనపు ఎస్పీగా, వరంగల్ ఏఎస్పీగా ఉన్న నగ్రాలె శుభమ్ ప్రకాష్‌ను నిజామాబాద్ అదనపు డీసీపీగా ప్రభుత్వం నియమించింది. అదేవిధంగా భైంసా అదనపు ఎస్పీ రాజేష్ మీనాను వనపర్తి అదనపు ఎస్పీగా, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా ఉన్న పి.మౌనికను అదే జిల్లాకు అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. నిర్మల్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పాతిపాక సాయికిరణ్‌ను భైంసా ఎస్డీపీఓగా, వేములవాడ ఏఎస్పీగా ఉన్న రుత్విక్ సాయి కొట్టేను ఉట్నూరు ఎస్డీపీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. బదిలీ అయిన అధికారులందరూ తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని సీఎస్ ఆదేశించారు.

# డిజిటల్ 'హెల్త్'

మొదటి పేజీ తరువాయి

అన్నారు. ఫలితంగా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. డయాబెటీస్, హైపర్ టెన్షన్, గుండె జబ్బులు, కిడ్నీ జబ్బుల వంటి నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లు ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారాయని ఆయన పేర్కొన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల కిడ్నీలు దెబ్బతిని ఎంతో మంది రోగులుగా మారుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వెల్లడించారు. ఈ నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లను ఎదుర్కొనేందుకు ప్రజా ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని మైండ్ స్పేస్‌లో సొసైటీ ఆఫ్ ద రెనల్ న్యూట్రీషన్ అండ్ మెటబాలిజం వార్షిక సదస్సును ఆరోగ్యశాఖ ప్రారంభించారు. వ్యాధి నివారణపై అవగాహన, ఎర్లీ స్టేజ్‌లోనే వ్యాధుల గుర్తింపు, ట్రీట్‌మెంట్, రిహాబిలిటేషన్ వరకూ సమగ్రంగా ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఎన్సీడీ క్లినిక్స్ ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాల్లోనే కీమో థెరపీ అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రీజనల్ రిఫరల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో సీరమ్ క్రియాటినిన్ పరీక్ష కూడా ఉందని... కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశకో గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

## 20న రెండో విడత 'భరోసా'

మొదటి పేజీ తరువాయి

ప్రయోజనం కలగనుంది. ఈ విడతలో ఏకంగా రూ.5,653 కోట్ల నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇప్పటికే మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడత రైతు భరోసా నిధులను 1.50 కోట్ల ఎకరాలకు సీఎం విడుదల చేశారు. ఆ సమయంలో రూ.3,590 కోట్లను రైతుల అకౌంట్లలో జమ చేశారు. రాష్ట్రంలోని సుమారు 73 లక్షల మంది రైతులు.. ఈ రైతు భరోసా పథకం కింద.. పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.6 వేల చొప్పున అందుకుంటున్నారు. అయితే గత నెలలో విడుదల చేసిన తొలి విడత రైతు భరోసా పథకంలో భాగంగా ప్రతీ రైతుకు ఒక ఎకరా చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించగా.. మిగిలిన సొమ్మును సోమవారం రోజున జమ చేయనుంది. అయితే ఈ రెండు విడతలే ఆగకుండా త్వరలోనే మరో విడతలో రైతు భరోసా నిధులను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. వీలైనంత త్వరగా రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేసేలా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు.. కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన అన్నదాతలకు కూడా రైతు భరోసా పథకాన్ని అమలు చేసి వారి అకౌంట్లలో డబ్బులు జమచేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ఇటీవలె వెల్లడించింది. ఇలా కొత్త పాస్ బుక్కులు కలిగిన రైతులు సుమారు 85 వేల మంది ఉన్నారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## జాతికి విపక్షాల ద్రోహం

మొదటి పేజీ తరువాయి

ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్రం స్పష్టత ఇచ్చింది. మహిళల రిజర్వేషన్ల కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నాం. పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరం. విపక్ష పార్టీలు ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతాయి" అని చంద్రబాబు ధ్వజమెత్తారు.

## ట్రంప్‌కు ఓటమి రుచి చూపిస్తాం: మొజ్తాబా

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలతో ఆగ్రహించిన ఇరాన్ హర్మూజ్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సుప్రీం లీడర్ మెజ్తాబా ఖమేనీ పేరిట శనివారం ఒక ప్రకటన విడుదలైంది. మోజ్తాబా ఖమేనీ ప్రకటనలో " అమెరికా దళాలను ఓడించేందుకు ఇరాన్ నౌకాదళం సిద్ధంగా ఉంది. శత్రువులకు కొత్త రకమైన ఓటమిని రుచి చూపిస్తాం". అని హెచ్చరించారు. కాగా యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి మోజ్తాబా బహిరంగంగా కనిపించలేదు. కేవలం ఆయన పేరు మీద ప్రకటనలు మాత్రమే విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన తీవ్ర స్థాయిలో గాయపడ్డారని, ఆయన ముఖం వికారంగా మారిందని ప్రచారం జరిగింది. ఇరాన్- అమెరికా మధ్య సయోధ్య కుదురుతుందనే నేపథ్యంలో మరోసారి ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్.. ఒక రోజు గడవకముందే దానిని మూసివేసింది. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో సోమవారం జరగనున్న చర్చలలో ఏం జరగనుందా అనే టెన్షన్ నెలకొంది.

# చంద్రబాబు మరో షిండే

మొదటి పేజీ తరువాయి

ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమే .. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగం.. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అన్నారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరు.. ఆంధ్రప్రదేశ్ లో అపోజిషన్ కి కేవలం 11 సీట్లే ఉన్నాయి.. అలా అని ఆంధ్రప్రదేశ్ కు నేను రాజు అని చంద్రబాబు నాయుడు చట్టం తీసుకొస్తే ఒప్పుకుంటారా..? అని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేసే మోదీ కుట్రను ప్రజలంతా కలిసి ఓడించారన్నారు. డీలిమిటేషన్ బిల్లును పక్కనపెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లును మళ్లీ సోమవారం సభలో పెట్టాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో వేరే వేరే ముసుగు తొడుక్కుని వస్తే తాము కచ్చితంగా గుర్తిస్తామన్నారు సీఎం రేవంత్. సీట్ల పెంపులో మోదీ ఎన్నుకున్న విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

## ఇరాన్ దాడిహర్మ్యూజ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

నుంచి సుమారు 20 లక్షల బ్యారెల్ల ముడి చమురుతో వెళ్తున్న ఒక భారీ ఆయిల్ ట్యాంకర్‌తో పాటు మరో భారతీయ నౌకను ఇరాన్ సేనలు అడ్డుకున్నాయి. హర్మూజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన క్రమంలో ఇరాన్ బలగాలు ఈ నౌకలపై కాల్పులకు తెగబడ్డాయి. కాల్పుల తీవ్రత పెరగడంతో ప్రమాదాన్ని పసిగట్టిన భారత నౌకలు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాయి. హర్మూజ్ నుంచి తిరిగి వెనక్కి వెళ్లిపోయినట్లుగా సమాచారం. అయితే, అదృష్టవశాత్తూ ఈ ఘటనలో నౌకలకు గానీ, అందులోని సిబ్బందికి గానీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. నౌకలతో పాటు సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని ప్రాథమిక సమాచారం అందుతోంది. అంతర్జాతీయ జలాల్లో వాణిజ్య నౌకలపై ఈ రకమైన దాడులు జరగడాన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ఇరాన్ రాయబారిని పిలిపించి కేంద్ర ప్రభుత్వం సమన్లు ఇచ్చే అవకాశం ఉంది. అసలు కాల్పులు జరపడానికి గల కారణాలను వివరించాలని భారత్ డిమాండ్ చేసే దిశగా అడుగులు వేస్తోంది.

## కెరమెరిలో 44.6 డిగ్రీలు

మొదటి పేజీ తరువాయి

అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం నేడు 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

## సెకండియర్‌లోనూ ఇంప్రూవ్‌మెంట్

మొదటి పేజీ తరువాయి

రాసే అవకాశం కల్పించింది. ప్రస్తుతం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉండగా.. ఇకపై ద్వితీయ ఇంటర్ విద్యార్థులూ తమ మార్కుల్ని మెరుగుపరుచుకొనే అవకాశాన్ని ఈ ఏడాది నుంచే కల్పిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇతర రాష్ట్రాల బోర్డుల్లో అమలులో ఉన్న ఇంప్రూవ్‌మెంట్ విధానాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం చర్చించి విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ద్వితీయ ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులందరికీ ప్రథమ సంవత్సరం తరహాలోనే సబ్జెక్టుల వారీ ఉత్తమ మార్కుల విధానంతో 'ఒకే ప్రయత్నం'లో ఇంప్రూవ్‌మెంట్ అవకాశాన్ని ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. ఇటీవల ఇంటర్ ఫలితాలను ప్రకటించిన ఇంటర్‌బోర్డు అధికారులు మే 21వ తేదీ నుంచి జూన్ 4 వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# హైదరాబాద్‌లో 'ట్యాంకర్' బతుకులు

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జలమండలి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్లు ఎన్. పంకజ, అశోక్ సామ్రాట్, సంతోష్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఎండకాలం రాగానే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుందని, రికార్డు స్థాయిలో బుకింగ్ లు వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2021 జనవరి, ఫ్రబవరి మాసాల్లో సుమారు 52 వేల వాటర్ ట్యాంకర్ బుకింగ్ లు రాగా, 2026 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో అది కాస్త లక్షా 8 వేలకు పెరిగి, రెండింతలైందని ఆయన వివరించారు. ఒకే సారి కొన్ని ప్రాంతాల నుంచి వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ వస్తుండటంతో గతేడాది తాము స్టడీ నిర్వహించి, వాస్తవాలను గుర్తించామన్నారు. ఈ ఆరు ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతోపాటు హైరైజ్డ్ బిల్డింగ్స్ వస్తున్నాయని తెలిపారు. హాస్టళ్లు వంటివి ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. చాలా ప్రాంతాల్లో కేవలం వంద చదరపు గజాల స్థలంలో ఆరేడు అంతస్తులు నిర్మించి, వాటిని హాస్టళ్లుగా వినియోగిస్తున్నారని, అక్కడ అవసరాలకు తగిన విధంగా డైలీ ట్యాంకర్ల బుకింగ్ లు వస్తూ డిమాండ్ పెరుగుతుందన్నారు. జలమండలికి సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 12 వేల కిలోమీటర్ల పొడువున పైప్ లైన్ వ్యవస్థ ద్వారా దాదాపు 14.50 లక్షల మందికి మంచినీటిని సరఫరా చేస్తున్నామని అశోక్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ మాసంలోని గడిచిన 18 రోజుల్లో సుమారు 2 లక్షల 83 వేల ట్యాంకర్ బుకింగ్ లు వచ్చాయని, వీటిలో దుర్గం చెరువు ప్రాంతం నుంచి గతేడాది ఇదే నెలలో 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 1900 బుకింగ్ లు రాగా ఈ సారి ఆ సంఖ్య 2400 కు పెరిగిందని, అలాగే మణికొండలో గత సంవత్సరం ఇదే తేదీ నాటికి 690 ఉండగా, ఇపుడు ఆ సంఖ్య వెయ్యికి పెరిగిందని ఎండీ వివరించారు. వచ్చిన బుకింగ్ లలో 10 నుంచి 15 శాతం బుకింగ్ లు కేవలం నాలుగు ప్రాంతాల నుంచే వచ్చినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం జలమండలిలో దాదాపు 86 వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు, 1125 వాటర్ ట్యాంకర్లున్నట్లు ఆయన తెలిపారు. 2021 నుంచి అవసరానికి తగిన విధంగా, డిమాండ్ ను బట్టి ఫిల్లింగ్ స్టేషన్లు, వాటర్ ట్యాంకర్ల సంఖ్య ను పెంచుతూ వస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో ఈ 45రోజులు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నదని, నీటిని పొదుపువాడుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. 20శాతం నీటిని పొదుపు చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది సైతం ఎండలు తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారని, ఇప్పటి నుంచే నీటి వృధాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయితే పానీ యాప్ ఆదివారం నుంచి మళ్లీ ప్రారంభమవుతోందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన వాటర్ ను రెడ్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నామని తెలిపారు. పరిశ్రమలు, ల్యాండ్ స్కేపింగ్, గార్డెన్లకు సరఫరా చేయడం ద్వారా జలమండలి ద్వారా సరఫరా చేస్తున్న నీటిపై ఒత్తిడి తగ్గనుందని తెలిపారు.









# కాలేయ ఆరోగ్యం కాపాడుకుందాం

## ఆరోగ్యకర జీవనశైలితో వ్యాధులకు చెక్

**ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19న ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. కాలేయ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు సరైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.**

మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో కాలేయం ఒకటి. ఇది శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, రక్తాన్ని శుద్ధి చేయడం, పోషకాలను ప్రాసెస్ చేయడం, జీర్ణక్రియను మెరుగుపరచడం వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తుంది. అదేవిధంగా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో కూడా కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, ఆధునిక జీవనశైలిలో పెరిగిన చెడు అలవాట్లు కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మద్యం సేవనం, ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం, అధిక కొవ్వు మరియు చక్కెరలతో కూడిన ఆహారాలు కాలేయ వ్యాధులకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**కాలేయానికి హానికరమైన ఆహారాలు**

- ఆల్కహాల్, ప్రాసెస్డ్ ఫుడ్స్
- అధిక కొవ్వు పదార్థాలు
- షుగర్ అధికంగా ఉండే పానీయాలు
- ప్యాకేజ్డ్ ఫుడ్స్, అధిక ఉప్పు

**కాలేయానికి మేలు చేసే ఆహారాలు**

- ఆకుకూరలు, తాజా కూరగాయలు
- నట్స్, ఆలివ్ ఆయిల్
- యాపిల్స్, బ్లూబెర్రీస్
- బీట్‌రూట్, గ్రీన్ టీ

**కాలేయ వ్యాధుల లక్షణాలు**

- ఎప్పటికప్పుడు అలసటగా అనిపించడం కళ్లకు, చర్మానికి పసుపు రంగు (జాండిస్)
- కుడి వైపు పొత్తికడుపులో నొప్పి
- ముదురు రంగులో మూత్రం





### చక్కెర పానీయాలు వద్దు



ఈ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. అధికంగా చక్కెరతో కూడిన పానీయాలు తీసుకోవడం వల్ల కాలేయంపై భారం పెరుగుతుంది. దీనివల్ల 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' వచ్చే ప్రమాదం ఉంది. గ్లూకోజ్ మాత్రమే కాకుండా ఫ్రక్టోజ్ కూడా కాలేయానికి హానికరమే. పండ్లలో కూడా ఫ్రక్టోజ్ ఉండటంతో వాటిని పరిమితంగా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్స్, వేపుళ్లు, షుగర్ డ్రింక్స్ తగ్గిస్తూ, మాంసాహారం మరియు మద్యం మితంగా తీసుకోవడం ద్వారా కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం – ఇవే కాలేయాన్ని కాపాడే మూడు ప్రధాన ఆయుధాలు. ఈ ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలి.

**- డాక్టర్ మనోజ్ రెడ్డి**

**మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# ఆపరేషన్ సేఫ్ స్కూల్

### 558 దుకాణాలపై దాడులు

### సజ్జనార్ ఆధ్వర్యంలో ఆపరేషన్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతమొందించడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం శనివారం నగరవ్యాప్తంగా 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' పేరుతో భారీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. విద్యాసంస్థల పరిసరాలను వ్యసనరహితంగా తీర్చిదిద్ది, చిన్నారులు పెడదోవ పట్టకుండా చూడాలనే సంకల్పంతో ఈ ప్రత్యేక సోదాలు చేపట్టింది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం, పొగాకులోని నికోటిన్‌కు అలవాటుపడటమనేది మాదకద్రవ్యాల ఊబిలోకి వెళ్లేందుకు మొదటి మెట్టుగా మారుతోంది. విద్యాసంస్థల సమీపంలో లభించే పొగాకు ఉత్పత్తుల వల్ల విద్యార్థులు క్రమంగా ఆల్కహాల్, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉంది. ఈ అలవాట్లు చివరకు వారిని చిన్నపాటి నేరాల నుంచి తీవ్రమైన నేరాల వైపు పురికొల్పి, వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయి. ఈ విషవలయాన్ని ప్రాథమిక దశలోనే తుంచివేసేందుకు పోలీసులు ఈ కఠిన చర్యలకు ఉపక్రమించారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీవోటీపీఏ) 2003 సెక్షన్ 6(బీ) ప్రకారం విద్యాసంస్థలకు 100 గజాల లోపు పొగాకు విక్రయాలు పూర్తిగా నిషిద్ధం. అలాగే, మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం జువైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 77 ప్రకారం శిక్షార్హమైన నేరం. ఈ చట్టాల అమలును పక్కాగా పర్యవేక్షిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ నేతృత్వంలో శనివారం సుమారు 5 వేలమంది సిబ్బంది విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న 558 దుకాణాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ డ్రైవ్ లో టాస్క్‌ఫోర్స్, స్పెషల్ టీమ్స్, హెచ్‌న్యూ, రిజర్వ్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పాల్గొన్నారు. సీపీ సజ్జనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. చిరాగ్ అలీ లేన్, రెడ్ హిల్స్, మెహదీపట్నం, మల్లెపల్లి ప్రియా టాకీస్ జంక్షన్, గోశామహల్ వంటి రద్దీ ప్రాంతాల్లోని విద్యాసంస్థల సమీపంలో ఉన్న దుకాణాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించి విద్యాసంస్థల సమీపంలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న నిర్వాహకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. గోషామహల్‌లోని ఎంజే బ్రిడ్జి వద్ద సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తూ వారి భవిష్యత్తుతో ఆడుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేపట్టిన డెకాయ్ ఆపరేషన్‌లో పలు దుకాణదారులు నిబంధనలను బేఖాతరు చేస్తూ చిన్నపిల్లలకు పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్నట్లు ఆధారాలతో సహా తేలిందని వివరించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఇలాంటి విక్రయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ తరహా నేరాలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా ఉంచేందుకు వీలుగా 'హెచ్‌న్యూ' విభాగంలో ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ముప్పును అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యతే కాదని, విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సైతం సామాజిక బాధ్యతగా స్పందించాలని కోరారు. విద్యాసంస్థల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. పిల్లల ప్రవర్తన, వారి స్నేహితులు, పాఠశాల ముగిసిన తర్వాత వారి కదలికలపై తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. విద్యాసంస్థల సమీపంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా హెచ్‌న్యూ ఫోన్ నంబర్ 87126 61601కు సమాచారం అందించాలని సూచించారు.

## తెలంగాణను తేజస్వీ అవమానించారు: పొన్నం

న్యూఢిల్లీ: దశాబ్దాలుగా ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను బీజేపీ కర్ణాటక ఎంపీ తేజస్వీ సూర్య అవమానించారని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆయన అవమానిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరు కూడా మెదపలేదని విమర్శించారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల్లో ఉండకూడదని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని మంత్రి అన్నారు.

## నాచారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

నాచారం–హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నాచారం నుంచి చిలుకానగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఒక కాటన్ మిల్లు గిడ్డంగిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ మంటలు ఎగిసిపడటంతో గోదాములో నిల్వ ఉన్న సరుకు పూర్తిగా దగ్ధమైంది. మంటలు పక్కనే ఉన్న మ్యాట్రెస్ కంపెనీకి కూడా వ్యాపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు.




## దక్షిణాదిని ఒప్పించే బాధ్యత నాది: రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు. ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి: దుద్దిళ్ల

### సోమవారం కాటారంలో సీఎం కార్యక్రమం

కాటారం, ఏప్రిల్ 18 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## విద్యుత్ ప్రమాద బాధితులకు పరిహారం చెక్కులు పంపిణీ

ధర్మపురి, ఏప్రిల్ 18 (ఈవార్తలు): విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిహారం చెక్కులను అందజేశారు. ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన గటిక చిన్నయ్య మూడు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మరణించిన నేపథ్యంలో, ఆయన భార్య గటిక అమ్మాయికి రూ.5 లక్షల పరిహారం చెక్కును శనివారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అందజేశారు. అలాగే వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామానికి చెందిన రాపాక మహేందర్ గేదె విద్యుత్ షాక్‌తో మరణించగా, ప్రభుత్వం తరఫున రూ.40 వేల పరిహారం చెక్కును మంత్రి లక్ష్మణ్ కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం, డీఈ గంగారం, గ్రామ సర్పంచ్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## జడ్జిని కలిసిన జిల్లా ఎస్పీ

కోరుట్ల, ఏప్రిల్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రేణుక యార ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి రేణుక యారను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

## జగిత్యాలకు త్వరలో పాస్ పోర్టు కేంద్రం

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో పోస్ట్ ఆఫీస్ పాస్ పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. శనివారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురితో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.బోగ శ్రావణి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ను న్యూ ఢిల్లీలోని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ప్రత్యేక పాస్ పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుపై విజ్ఞప్తి పత్రాన్ని అందించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సానుకూలంగా స్పందించి, జగిత్యాల జిల్లాలో పాస్పోర్ట్ సేవల అవసరాన్ని గుర్తించి, త్వరలోనే పాస్ పోర్టు కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేంద్రం ఏర్పాటుతో జగిత్యాల, పరిసర ప్రాంతాల ప్రజలకు పాస్ పోర్ట్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని డా.బోగ శ్రావణి తెలిపారు.

## ఎన్‌హెచ్-63 భూసేకరణపై ఆర్బిట్రేషన్ విచారణ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): జాతీయ రహదారి ఎన్‌హెచ్-63 భూసేకరణకు సంబంధించి శనివారం జగిత్యాల కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్బిట్రేషన్ విచారణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ విచారణలో గోపులపూర్, మద్దునూర్, సిరివంచకోట, యశ్వంత్‌రావుపేట (బుగ్గరం మండలం), స్తంభంపల్లి (వెల్గటూర్ మండలం) గ్రామాలకు చెందిన మొత్తం 397 మంది అవార్డుదారుల అంశాలు పరిశీలించారు. పిటిషనర్ల తరఫున అడ్వకేట్లు, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్‌హెచ్-63 ప్రాజెక్ట్ డైరెక్టర్ (మంచిర్యాల) తరఫున న్యాయవాది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జి సెక్షన్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా డాక్టర్ నర్సింహా

కొడిమ్యాల, ఏప్రిల్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లిలోని జెఎన్టియూ కళాశాల ప్రిన్సిపల్ డా.జి.నర్సింహా జెఎన్టియూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా నియమితులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేయగా, శనివారం ఆయనకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.



## జగిత్యాల సభ బీఆర్ఎస్ బహిరంగ సభనా?

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): ఈ నెల 20న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ సమావేశం జీవన్ రెడ్డి చేరిక సభనా, లేక పార్టీ బహిరంగ సభనా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. జగిత్యాలలోని మోతే రోడ్డులో పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందయ్య, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి తదితరులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని ఎక్కడైనా బీఆర్ఎస్ సభలు నిర్వహించుకోవడంపై అభ్యంతరం లేదని, అయితే జగిత్యాల సభ స్వరూపంపై కేటీఆర్, హరీష్ రావులు క్లారిటీ ఇవ్వాలని అన్నారు. అక్రమ సంపాదనతో జన సమీకరణ చేస్తున్నారని ఆరోపించిన మంత్రి, చిన్న స్థలంలో భారీగా జనాన్ని సమీకరించేందుకు ఇన్‌చార్జీలను నియమిస్తున్నారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి పార్టీ వీడడం బాధాకరమని, ఆయన ఆరోపణలను ఖండిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలన గొప్పదైతే 2023 ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఓటు వేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విమర్శలు చేయడం తగదని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐ ఆందోళనలు వద్దు: సీజేఐ

న్యూఢిల్లీ: కృత్రిమమేధ (ఏఐ) వినియోగంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థలో ఏఐ వాడకంపై ఆయన సూచనలు చేశారు. ఏఐ విషయంలో ఆందోళనలు వద్దని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కర్ణాటక రాష్ట్ర స్టేట్ జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐ మనుషులకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని గుర్తించాలని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతౌల్యత పాటించాలని అన్నారు. క్లిష్టమైన ప్రశ్నలతో కూడిన ఓ కేసు మీ ముందుకు వస్తే, ఆ సమస్యను పరిష్కరించడానికి మీరు సమయం వెచ్చించి ఆలోచిస్తారని, దానిని పరిష్కరించాక మీరు గొప్ప అనుభూతిని పొందుతారని ఆయన అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏఐ సామర్థ్యం సరిపోకపోవచ్చని అభిప్రాయపడ్డారు. కాబట్టి ఏఐ గురించి ఆందోళన అవసరం లేదని అన్నారు. న్యాయాధికారులు ఉత్పాదకతను పెంచడానికి తగిన శిక్షణ తీసుకుంటారని, శ్రద్ధతో పనిచేస్తారని అన్నారు. కానీ ఏఐ డేటా ఆధారంగా పనిచేస్తుందని గుర్తు చేశారు.



## మల్యాలలో హిందూ బైక్ ర్యాలీ

మల్యాల, ఏప్రిల్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో జరగనున్న హిందూ సమ్మేళనం సందర్భంగా యువత శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుండి యువకులు గ్రామ పెద్దలు ప్రజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని ఘనంగా నిర్వహించారు. తెల్ల చొక్కాలు ధరించి, కాషాయ పతాకాలతో "జై శ్రీరామ్" నినాదాలు చేస్తూ మల్యాల చుట్టూ ప్రక్క ల ఊర్లోలల్లో ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీ మల్యాల మార్కండేయ గుడి వద్ద ప్రారంభమై, ముఖ్య వీధుల మీదుగా తిరిగి సమ్మేళనం ప్రాంగణానికి చేరుకుంది. హిందూ ధర్మ పరిరక్షణ, సామాజిక ఐక్యత, యువతలో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు అలాగే ఆదివారం మల్యాల అంగడి బజార్ లో జరగబోయే హిందూ సమ్మేళన కార్యక్రమానికి ప్రతి హిందువు తప్పకుండా రావాలని హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ ఆహ్వానించింది.

## వైద్య కార్మికులకు అండగా ఉంటాం

**సమ్మె నిర్ణయాన్ని విరమించుకోవాలి**

**కార్మిక నేతలకు వైద్యారోగ్యమంత్రి హామీ**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): వచ్చే నెల 25న తలపెట్టిన సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపినట్లు ఎస్పీఎస్ వెల్లడించింది. సమ్మె నోటీస్ నేపథ్యంలో స్పందించిన మంత్రి.. ఎస్పీఎస్ నేతలతో మాట్లాడారని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కుర్రి సైదయ్య తెలిపారు. జూన్ ఆఖరు నాటికి వైద్య కార్మికులు కోరినట్లుగా అదనపు వేతనంతో కూడిన జీతాలు అందిస్తామని తెలిపారని వివరించారు. వైద్య కార్మికుల సమస్యలపై సీఎంతో చర్చించి, పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని తెలిపినట్లు వెల్లడించారు. స్పష్టమైన హామీ ఇస్తే తమ సమ్మెను విరమించుకుంటామని సైదయ్య, రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న బొస్క నరేష్ స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు, హైదరాబాద్ సెంటర్ గాంధీ హాస్పిటల్ ఎస్పీఎస్ నాయకుడు ఆనంద్, మురళి, అనిల్, నాగరాజు, శ్రావణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## పవన్‌కు శస్త్రచికిత్స

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం ఉదయం అధికారులతో సమావేశంలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత వైద్యుల సూచన మేరకు శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను కూడా పవన్ కల్యాణ్ రద్దు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలతో పాటు ఎంఆర్ఐ కూడా నిర్వహించారు. రిపోర్టులను సమీక్షించిన వైద్యులు, శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించి విజయవంతంగా పూర్తి చేశారు.



## వెలచ్చేరిలో అడువాల జ్యోతి ప్రచారం జోరు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): చెన్నై సౌత్ పరిధిలోని వెలచ్చేరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం మూడో రోజు మరింత వేగం పుంజుకుంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి జె.ఎం.హెచ్. హసన్ మౌలానా తరఫున అడువాల జ్యోతి లక్ష్మణ్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాలనీలు, ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో ప్రజలను కలుసుకుని మద్దతు కోరారు. ప్రచారం సందర్భంగా అభ్యర్థికి ప్రజలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తుందని జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## జనగణనను విజయవంతం చేయాలి: కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): జనగణన 2027 ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జనగణన దేశ అభివృద్ధికి కీలకమని తెలిపారు. ఖచ్చితమైన గణాంకాల ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు సులభమవుతుందని పేర్కొన్నారు. ఇంటింటి వివరాల సేకరణ, డిజిటల్ నమోదు, గోప్యత పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించగా, విధులను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలో జనగణనను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసిల్దార్ షాదాబ్ హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు తేజస్వీ సారీ చెప్పాలి: హరీశ్



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18 (ఈవార్తలు): తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలపై భాజపా ఎంపీ తేజస్వి యాదవ్ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జగిత్యాలలో ఈనెల 20న జరగనున్న కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనను ఇండియా-పాకిస్తాన్‌తో పోల్చడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానపరచడమేనని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు అమరుల త్యాగాలను తక్కువ చేసి చూపే ప్రయత్నమని, తెలంగాణపై విషం చిమ్మినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించి క్షమాపణ చెప్పించాల్సింది పోయి వెనుకేసుకొస్తున్నారని విమర్శించారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు లేకపోవడం లోటుగా కనిపించిందని, కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఉన్నా ఎవరూ ఖండించలేదన్నారు. తేజస్వి యాదవ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు అనుసంధానం చేయడం ద్వారా భాజపా చిత్తశుద్ధి లేనిదని, కాంగ్రెస్ కూడా మహిళలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, "రేవంత్ రెడ్డి వెళ్లాలి.. కేసీఆర్ రావాలి" అనేది తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

## మోదీ దత్తపుత్రుడు జగన్: షర్మిల



విజయవాడ, ఏప్రిల్ 18 (ఈవార్తలు): వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు బట్టబయలైందని, విపక్షం ముసుగులో ఉన్నది ఆర్ఎస్ఎస్ పక్షమేనని తేలిపోయిందని ఆమె ధ్వజమెత్తారు. "దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే జగన్‌కు ముఖ్యమా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అక్రమ డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు. తన ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి, కేసుల నుంచి రక్షణ పొందేందుకే జగన్ బీజేపీకి బానిసగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. "కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా? బీజేపీ బిల్లులకు గొర్రెలా గుడ్డిగా తలాడించాలా? మోదీ మెప్పుకోసం సొంత కాకిలెక్కలు అల్లాలా?" అని నిలదీశారు. మహానేత వైఎస్ఆర్ సిద్ధాంతాలను, విలువలను జగన్ మంటగలిపారని, దీనిపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లును విపక్షాలు అడ్డుకుంటే, ఆ బిల్లును అడ్డుకోవడం ద్వారా ఏం సాధించారని జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ దొంగ బిల్లుకు ఓటేసి జగన్ ఏం సాధించారని, కోట్లాది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ సహా ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ బీజేపీ ప్రభుత్వం దాని అమలును ఆలస్యం చేసేందుకే డీలిమిటేషన్, జనాభా లెక్కలు అనే నిబంధనలు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. 2026 జనాభా లెక్కలు, కులగణన పూర్తయ్యాక, ఆ గణాంకాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని వివరించారు. అధికారిక గణాంకాలు లేకుండానే సీట్లు పెంచి దేశాన్ని ఉద్ధరిస్తున్నామని బీజేపీ చెబితే, జగన్ గుడ్డిగా నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని, ఈ మూడు పార్టీలూ మోదీ మెప్పుకోసమే పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నది తామేనని ఆమె పేర్కొన్నారు.

## జర్నలిస్టులు ఉగ్రవాదులా?

**చంద్రబాబుపై జగన్ విమర్శలు**



తాడేపల్లి, ఏప్రిల్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని, ప్రత్యేకంగా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే దేశద్రోహమా అని నిలదీశారు. ఇది జంగిల్ రాజ్ కాదా అని ఆయన ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్టులైన పూడి శ్రీహరి, కేవీఆర్‌లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు జగన్ తెలిపారు. "బీసీ వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పూడి శ్రీహరి చేసిన తప్పేంటి? అతనిపై అక్రమ కేసులు పెట్టి, ఇంట్లో సోదాలు చేయడానికి అతనేమైనా ఉగ్రవాదా? టెర్రరిస్టా?" అని జగన్ ప్రశ్నించారు. అదేవిధంగా, తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కేవీఆర్ ఇంట్లో లేని సమయంలో ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని ఆరోపించారు. పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా అని నిలదీశారు. గడిచిన రెండేళ్లలో మహిళలు, బాలికలపై జరిగిన ఎన్నో దాడుల ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, తమను ప్రశ్నించిన వారిపై మాత్రం వెంటనే కేసులు పెడుతోందని జగన్ విమర్శించారు. "మీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసినా వారిపై చర్యలు తీసుకోలేదు. కానీ, వాస్తవాలు మాట్లాడితే మీకు ఎందుకు అంత ఉలుకు?" అని ప్రశ్నించారు. పౌరులకు రక్షణ కల్పించడంలో విఫలమై, స్వార్థ రాజకీయాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సుపరిపాలన అవుతుందా అని జగన్ అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని, ఈ చర్యలకు కచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. "మీరు చేస్తున్న దుర్మార్గాలకు దేవుడు, ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది" అని జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కక్ష సాధింపు చర్యలు, అక్రమ అరెస్టులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.1.6 కోట్ల భారీ మోసం

**ఇండస్‌ఇండ్ బ్యాంకు అధికారితో సహా ముగ్గురు నిందితుల అరెస్ట్**

దుబ్బాక, ఏప్రిల్ 18 (ఈవార్తలు): డిజిటల్ అరెస్ట్ పేరుతో జరిగిన భారీ కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దూకుడు పెంచింది. శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, ఓ బ్యాంకు అధికారితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసింది. ఓ సీనియర్ సిటిజన్‌ను 'డిజిటల్ అరెస్ట్' చేస్తామంటూ బెదిరించి, ఆయన నుంచి రూ. 1.6 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఈ కేసు నమోదైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. అరెస్టయిన వారిలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ నాటి అసిస్టెంట్ మేనేజర్ దుబ్బాక మహేశ్‌తో పాటు రాజేశ్ కన్న, వాయల శ్రీనివాస్ ఉన్నారు. నిందితులు ఓ కంపెనీ పేరుతో నకిలీ బ్యాంకు ఖాతాను తెరిచి, మోసం చేసిన డబ్బును అందులోకి మళ్లించినట్లు సీబీఐ గుర్తించింది. ఆ తర్వాత నేరం మూలాలను దాచిపెట్టేందుకు, ఆ డబ్బును పలు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. నకిలీ ఖాతా తెరవడంలో బ్యాంకు అధికారి మహేశ్ సహకరించాడని, మిగిలిన ఇద్దరు నిందితులు మ్యూల్ అకౌంట్లను ఏర్పాటు చేయడం, నిధుల తరలింపును నిర్వహించడం వంటి పనులు చేశారని అధికారులు తెలిపారు. నిందితులకు సంబంధించిన ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ వెల్లడించింది. వాటిని విశ్లేషించి మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నట్లు పేర్కొంది.

# రష్యా చమురు కొనుగోలుపై అమెరికా యూటర్న్

## భారత్ సహా వివిధ దేశాలకు ఊరట

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలకు చమురు విషయంలో అమెరికా ఊరట కల్పించింది. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మరోసారి మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ఆందోళనలు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేలా అమెరికా ఆంక్షలను సడలించింది. ఇది భారతదేశం సహా వివిధ దేశాలకు భారీ ఊరట కలిగించే విషయం. ఇటీవలే ఇరాన్ యుద్ధం కారణంగా రష్యా నుంచి చమురు కొనుగోలుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా, కొన్నిరోజులకే మళ్లీ ఆంక్షలను విధించింది. ప్రస్తుతం ఇరాన్ మళ్లీ హర్మూజ్ జలసంధి మూసివేత నేపథ్యంలో చమురు ధరల స్థిరీకరణ కోసం అమెరికా రష్యా చమురుపై ఆంక్షలను సడలించింది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ డిపార్టుమెంట్ ఆదేశాలు జారీ చేసింది. మే 16వ తేదీ వరకు ఆంక్షల సడలింపు వర్తిస్తుందని తెలిపింది. అయితే రష్యా నుంచి కొత్తగా చమురు కొనుగోలుపై కాకుండా, సముద్ర మార్గంలో రవాణాలో ఉన్న చమురు కొనుగోలు చేయడానికి అమెరికా అనుమతివ్వడం గమనార్హం. రష్యా చమురు కొనుగోలుపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసిన నేపథ్యంలో భారత్ గతంలో కంటే మూడు రెట్ల చమురును కొనుగోలు చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. రష్యా నుంచి అత్యధిక చమురు కొనుగోలు చేస్తున్న రెండో దేశం భారత్. సముద్రమార్గంలో ఉన్న రష్యా చమురును కొనుగోలు చేయడానికి మినహాయింపు లేదని అమెరికా ఆర్థికమంత్రి రెండు రోజుల క్రితం ప్రకటించారు. అయితే అంతలోనే మాట మార్చి, మినహాయింపును దాదాపు నెల రోజులు పొడిగించడం గమనార్హం. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రష్యా నుంచి చమురు కొనుగోలుకు వివిధ దేశాలు ఒత్తిడి తెచ్చినందువల్లే అమెరికా యూటర్న్ తీసుకుందని భావిస్తున్నారు.



## బ్లాక్‌మెయిల్ చేయడం కుదరదు: ట్రంప్

వాషింగ్టన్: ఒకవైపు హర్మూజ్ జలసంధి, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా దిగ్బంధించడం, మరోవైపు జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం మరోసారి ప్రపంచవ్యాప్తంగా చమురు ఆందోళనలకు కారణమైంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ఇరాన్ తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని, కానీ ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని అన్నారు. ఇరాన్ తమను బ్లాక్‌మెయిల్ చేయలేదని హెచ్చరించారు. "టెహ్రాన్ దశాబ్దాలుగా ఇలాగే వ్యవహరిస్తోంది. కానీ వారు మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయలేరు" అని వైట్ హౌస్ లో విలేకరుల సమావేశంలో ట్రంప్ అన్నారు. ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈరోజు ముగిసే సమయానికి సంప్రదింపులకు సంబంధించి కొంత సమాచారం లభిస్తుందని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ తొలుత ప్రకటించింది. ఇరవై నాలుగు గంటలు తిరగక ముందే తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటించింది. తమ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.

## డోర్నా భారత్ చేరింది

టెహ్రాన్: 2 మిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్‌తో కూడిన సూపర్ ట్యాంకర్ 'డోర్నా' భారత దక్షిణ తీరానికి చేరుకుందని హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. అమెరికా నావికాదళం హర్మూజ్ జలసంధిని దిగ్బంధించినప్పటికీ ముడి చమురుతో కూడిన ఈ ట్యాంకర్ విజయవంతంగా భారత్ చేరుకుందని పేర్కొంది. అమెరికా దిగ్బంధనానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ జలాల నుంచి ఇది బయలుదేరిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, అమెరికా ఆంక్షలు, నావికాదళం గస్తీ నడుమ కూడా వారం రోజుల వ్యవధిలో భారత్‌కు మూడు విడతల్లో దాదాపు 6 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు వచ్చింది. ప్రస్తుతం దక్షిణ తీరానికి చేరుకున్న డోర్నా నౌక సమీపంలోని స్థానిక రిఫైనరీకి సుమారు 20 లక్షల బ్యారెళ్ల చమురును అందజేయనున్నట్లు తెలుస్తోంది.

## ఢిల్లీలో ఇరాన్ రాయబారికి కేంద్రం సమన్లు

న్యూఢిల్లీ: వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న భారత నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులు జరపడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత ప్రభుత్వం, ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీకి సమన్లు జారీ చేసింది. శనివారం విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యాలయానికి ఆయన్ను పిలిపించి, ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలిపినట్లు తెలుస్తోంది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) బలగాలు, భారత జెండాతో ప్రయాణిస్తున్న ఓ భారీ ముడి చమురు ట్యాంకర్‌పై కాల్పులు జరిపాయి. అయితే, ఈ ఘటనలో ట్యాంకర్‌తో పాటు సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడిని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎంటీవో) కూడా ధృవీకరించింది. ఒమన్ తీరానికి 20 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగిందని, ఎలాంటి హెచ్చరికలు లేకుండానే ఐఆర్‌జీసీ గన్‌బోట్లు కాల్పులు జరిపాయని పేర్కొంది. ఇదే ప్రాంతంలో ఓ కంటైనర్ షిప్‌పై కూడా గుర్తు తెలియని వస్తువుతో దాడి జరిగిందని యూకేఎంటీఓ మరో ప్రకటనలో తెలిపింది. మరోవైపు, హర్మూజ్ జలసంధిపై తిరిగి తమ పూర్తి నియంత్రణను పునరుద్ధరించుకున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై అక్రమంగా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించింది. ఈ ఆంక్షలు తొలగించే వరకు జలసంధిపై తమ కఠిన నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. ఇరాన్ ప్రకటన తర్వాత సుమారు 10 నౌకలు హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించకుండా వెనుదిరిగినట్లు అంతర్జాతీయ షిప్పింగ్ డేటా వెల్లడించింది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు


న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నేడు సమావేశమైన కేంద్ర కేబినెట్, ఉద్యోగుల కరవు భత్యం (డీఏ)ను 2 శాతం పెంచేందుకు ఆమోదం తెలిపింది. ఈ పెంపుతో ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల భత్యం పెరగనుంది. సాధారణంగా ఫిబ్రవరి లేదా మార్చిలో రావాల్సిన ఈ ప్రకటన ఈ ఏడాది ఆలస్యమైంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా గత 12 నెలల సగటు ద్రవ్యోల్బణాన్ని అనుసరించి డీఏ పెంపును లెక్కిస్తారు. తాజా పెంపుతో మొత్తం డీఏ 60 శాతానికి చేరినట్లయింది. బ్యాంక్‌బజార్ సీఈఓ అధిల్ శెట్టి మాట్లాడుతూ.. "డీఏ సవరణలు ఒక నిర్దిష్ట ఫార్ములా ప్రకారం జరుగుతాయి. 2016లో 2 శాతంగా ఉన్న డీఏ, గత దశాబ్ద కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని ప్రతిబింబిస్తూ ఇప్పుడు దాదాపు 60 శాతానికి చేరింది" అని వివరించారు. అయితే, ఈ స్వల్ప డీఏ పెంపు కన్నా 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుపైనే ఉద్యోగ సంఘాలు ఎక్కువగా దృష్టి సారించాయి. వేతనాలు, పెన్షన్లు, సేవా నిబంధనలను సమగ్రంగా సవరించాలని వారు బలంగా కోరుతున్నారు. నేషనల్ కౌన్సిల్-జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ ఏప్రిల్ 14న ప్రభుత్వానికి సమర్పించిన మెమొరాండంలో తమ డిమాండ్లను స్పష్టంగా పేర్కొంది. కనీస మూల వేతనాన్ని రూ.69,000కు పెంచాలని, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 3.83గా నిర్ణయించాలని ఉద్యోగ సంఘాలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాయి. అలాగే, డీఏ 25 శాతానికి చేరినప్పుడల్లా దానిని మూల వేతనంలో విలీనం చేసే పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నాయి. ఈ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరిస్తే, దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది.

## యురేనియం ఇచ్చేది లేదు

### తేల్చి చెప్పిన ఇరాన్

టెహ్రాన్: తమ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియంను ఏ దేశానికీ బదిలీ చేసే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ముఖ్యంగా అమెరికాకు యురేనియంను పంపే అంశం ఎన్నడూ తమ పరిశీలనలో కూడా లేదని తేల్చి చెప్పింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ప్రభుత్వ టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలపై బఘాయి స్పష్టతనిచ్చారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు పూర్తిస్థాయిలో రాకపోకలు కొనసాగుతాయని చెప్పడం కొత్త దౌత్యపరమైన ఒప్పందంలో భాగం కాదని తెలిపారు. ఏప్రిల్ 8న అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మేరకే ఈ ప్రకటన చేశారని వివరించారు. ఈ ఒప్పందాన్ని లెబనాన్‌కు వర్తింపజేయడంలో అమెరికా విఫలమైందని ఇరాన్ ఆరోపించింది.

## లాహోరీ జీరా.. రూ.2,800 కోట్లు




చండీగఢ్: ఒకప్పుడు వీధి చివర దొరికే జీరా సోడా రుచి ఇప్పుడు రూ.వందల కోట్ల వ్యాపారంగా మారింది. ముగ్గురు కజిన్స్ తమ బాల్యపు జ్ఞాపకాలకు వ్యాపార రూపమిచ్చి, విదేశీ శీతల పానీయాల ఆధిపత్యానికి సవాల్ విసురుతున్నారు. పాకిస్థాన్‌లోని నగరం పేరుతో, పక్కా భారతీయ రుచితో రూపుదిద్దుకున్న 'లాహోరి జీరా' ప్రస్థానమిది. 2017లో సౌరభ్ ముంజల్, సౌరభ్ భుట్నా, నిఖిల్ దోడా అనే ముగ్గురు కజిన్స్ ఈ సంస్థను ప్రారంభించారు. పంజాబ్ వీధుల్లో గోలీ సోడా, ఉప్పు, జీరా పొడితో కలిపి అమ్మే డ్రింక్స్‌ను స్ఫూర్తిగా తీసుకున్నారు. మార్కెట్‌లో ఉన్న పెద్ద బ్రాండ్ల డ్రింక్స్‌లో ఈ దేశీ ఫ్లేవర్ లేకపోవడాన్ని గమనించి, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. కేవలం రూ.10 ధరతో 160ఎంఎల్ బాటిల్‌ను అందించి, తక్కువ సమయంలోనే వినియోగదారులను ఆకట్టుకున్నారు. భారత్-పాకిస్థాన్ విభజనకు ముందు ఉన్న ఉమ్మడి పంజాబ్ సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా దీనికి 'లాహోరి జీరా' అని పేరు పెట్టారు. లాహోర్ నగరం, భారత సరిహద్దుకు దగ్గరగా ఉండటం కూడా ఈ పేరుకు ఒక కారణం. సంస్థ వ్యవస్థాపకులలో ఒకరైన నిఖిల్ దోడా మాట్లాడుతూ, "మేమంతా కలిసి పెరిగాం, కలిసే ఏదైనా చేయాలని కలలు కన్నాం. భారతీయ పానీయాల మార్కెట్‌కు భారీ సామర్థ్యం ఉందని నమ్మాం" అని తెలిపారు. ప్రారంభంలో రెండు హ్యాండ్ మెషిన్లతో ఉత్పత్తి మొదలుపెట్టి, స్థానికులతో టేస్టింగ్ సెషన్లు నిర్వహించి ఫార్ములాను ఖరారు చేశారు. భారీ మార్కెటింగ్ ప్రకటనలకు బదులుగా ఉత్పత్తి సామర్థ్యం, పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించడంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. ఈ వ్యూహం అద్భుతంగా ఫలించింది. 2025లో సంస్థ ఆదాయం రూ.540 కోట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరం నాటికి సుమారు రూ.800 కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల మోతీలాల్ ఓస్వాల్ వెల్త్ నుంచి రూ.200 కోట్లు సమీకరించడంతో, కంపెనీ విలువ రూ.2,800 కోట్లకు చేరింది. ప్రస్తుతం లాహోరి జీరాతో పాటు లాహోరి శికంజి, నింబూ, కచ్చా ఆమ్ వంటి ఇతర ఉత్పత్తులను కూడా సంస్థ అందిస్తోంది. కేవలం 20 మందితో మొదలైన ఈ కంపెనీలో ఇప్పుడు 1,800 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక చిన్న ఆలోచన, పక్కా ప్రణాళికతో ఎలా భారీ విజయం సాధించవచ్చో 'లాహోరి జీరా' నిరూపిస్తోంది.

## మెటాలో 8,000 మంది ఇంటికి!

న్యూయార్క్: సోషల్ మీడియా దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చేపట్టనున్న తొలగింపుల ప్రక్రియలో భాగంగా తొలి విడత లేఆఫ్స్‌ను మే 20న నిర్వహించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మొదటి రౌండ్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10% మంది, అంటే దాదాపు 8,000 మంది ఉద్యోగులను తొలగించనున్నారని తెలుస్తోంది. ఈ మేరకు మూడు అంతర్గత వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై వందల బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నారు. ఏఐ ఆధారంగా కంపెనీ పనితీరును సమూలంగా మార్చాలన్న ఆయన వ్యూహంలో భాగంగానే ఈ లేఆఫ్స్ చోటుచేసుకుంటున్నాయి. ఏఐ సాయంతో తక్కువ మంది ఉద్యోగులతో ముఖ్యంగా మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించి, అధిక సామర్థ్యం సాధించాలని కంపెనీ భావిస్తోంది. అయితే, ఈ లేఆఫ్‌ల సమయం లేదా వాటి పరిధిపై స్పందించడానికి మేటా నిరాకరించింది. 2022-23 మధ్యకాలంలో "ఇయర్ ఆఫ్ ఎఫిషియెన్సీ" పేరుతో మెటా సుమారు 21,000 ఉద్యోగాలను తొలగించింది. అప్పట్లో కంపెనీ ఆర్థిక ఇబ్బందులు, షేర్ల పతనం వంటి కారణాలతో ఆ నిర్ణయం తీసుకుంది. కానీ, ప్రస్తుత పరిస్థితి భిన్నం. గతేడాది మెటా 200 బిలియన్ డాలర్ల ఆదాయం, 60 బిలియన్ డాలర్ల లాభం గడించి ఆర్థికంగా పటిష్ఠంగా ఉంది. అయినా సరే, భవిష్యత్ వ్యూహాల్లో భాగంగా ఉద్యోగులను తగ్గించుకోవాలని నిర్ణయించడం గమనార్హం. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా కంపెనీ అంతర్గతంగా అనేక మార్పులు చేస్తోంది. ఇంజనీర్లను "అప్లైడ్ ఏఐ" అనే కొత్త విభాగానికి బదిలీ చేస్తోంది. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన "మెటా స్మాల్ బిజినెస్" యూనిట్‌లోకి కూడా కొంతమంది సిబ్బందిని మార్చనున్నారు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో మరిన్ని లేఆఫ్‌లు ఉండే అవకాశం ఉందని, అయితే వాటి తేదీలు, సంఖ్యపై ఇంకా స్పష్టత రాలేదని నివేదిక పేర్కొంది. టెక్ రంగంలో ఏఐ కారణంగా ఉద్యోగాల కోత విధించడం ఇదే తొలిసారి కాదు. ఇటీవలే అమెజాన్ 30,000 మందిని, ఫిన్‌టెక్ సంస్థ బ్లాక్ దాదాపు సగం మంది సిబ్బందిని తొలగించాయి. ఇప్పుడు ఈ జాబితాలో మెటా కూడా చేరింది. డిసెంబర్ 31 నాటికి మెటాలో దాదాపు 79,000 మంది ఉద్యోగులు ఉన్నారు.




## దిగజారిన భారత ఆర్థిక ర్యాంకు

న్యూఢిల్లీ: ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, తాజాగా రెండు స్థానాలు దిగజారి ఆరవ ర్యాంకుకు పడిపోయింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం జపాన్, బ్రిటన్‌లు భారత్‌ను అధిగమించి వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. భారత జీడీపీ వృద్ధిలో వెనుకబడటం దీనికి కారణం కాదు. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన చమురు ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం కావడమే ఈ మార్పుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దిగుమతులపైనే అధికంగా ఆధారపడే భారత్, చమురు కొనుగోలుకు భారీగా డాలర్లను వెచ్చించాల్సి వస్తోంది. దీంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయి మారకం విలువ క్షీణించింది. ఫలితంగా డాలర్ల లెక్కల్లో భారత జీడీపీ పరిమాణం తగ్గిపోయి ర్యాంకుపై ప్రభావం చూపింది. ప్రభుత్వ వర్గాలు జీడీపీ అంచనాలను సవరించడం కూడా దీనికి మరో కారణంగా నిలిచింది. ఐఎంఎఫ్ అనుబంధ సంస్థ 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' 2026 లెక్కల ప్రకారం ప్రస్తుతం అమెరికా (30 ట్రిలియన్ డాలర్లు), చైనా (19 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (5 ట్రిలియన్ డాలర్లు) తొలి మూడు స్థానాల్లో సుస్థిరంగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో జపాన్ (4.38 ట్రిలియన్ డాలర్లు), బ్రిటన్ (4.27 ట్రిలియన్ డాలర్లు) ఉండగా... భారత్ 4.15 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ఆరో స్థానంలో నిలిచింది. 2022 సెప్టెంబరులో బ్రిటన్‌ను అధిగమించి భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. గతేడాది మే నెలలో నాటి నీతీ ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, జపాన్‌ను కూడా దాటి భారత్ నాలుగో స్థానానికి చేరిందని ప్రకటించారు. అయితే, తాజా పరిణామాలతో ఆ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. కాగా, జపాన్, బ్రిటన్, భారత్ జీడీపీల మధ్య వ్యత్యాసం చాలా స్వల్పంగానే ఉంది. రూపాయి మారకం విలువ తిరిగి స్థిరపడితే, భారత్ మళ్లీ నాలుగో స్థానాన్ని దక్కించుకోవడం పెద్ద కష్టమేమీ కాదని, వచ్చే ఏడాదే ఇది సాధ్యపడవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## ఎన్డీయే వైఫల్యానికి నిదర్శనం: ప్రియాంక

న్యూఢిల్లీ: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లు వీగిపోవడాన్ని ఆమె ప్రజాస్వామ్యానికి దక్కిన అతిపెద్ద విజయంగా అభివర్ణించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు అసలు మహిళల హక్కుల కోసమో లేదా డీలిమిటేషన్ కోసమో తెచ్చింది కాదని ఆమె విమర్శించారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ వ్యూహాన్ని తిప్పికొట్టాయని, తద్వారా లోక్‌సభలో అధికార పక్షాన్ని ఓడించగలిగామని ఆమె పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి ఇది ఒక 'చీకటి రోజు' అని ప్రియాంక వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఒక కీలక బిల్లు లోక్‌సభలో ఓడిపోవడం ఇదే తొలిసారి అని, ఇది వారి వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ క్రీడను ప్రజలు గమనిస్తున్నారని, విపక్షాల ఐక్యత ఈ ఓటమి ద్వారా స్పష్టమైందని ఆమె పునరుద్ఘాటించారు.

## మోనాలిసాను అరెస్ట్ చేయొద్దు!

కొచ్చి: కుంభమేళా స్టార్‌గా సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా భోంస్లే వివాహ వివాదం మరింత సంక్లిష్టంగా మారింది. ఈ కేసులో మోనాలిసాను అరెస్ట్ చేయవద్దని కోర్టు ఆదేశాలు ఉన్నాయని కొచ్చి నగర పోలీసులు స్పష్టం చేశారు. మరోవైపు మధ్యప్రదేశ్ పోలీసులు ఆమె ఆచూకీ కోసం కేరళలో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మోనాలిసాను అరెస్ట్ చేయరాదన్న కోర్టు ఉత్తర్వుల విషయాన్ని మధ్యప్రదేశ్ పోలీసులకు అధికారికంగా తెలియజేశామని కొచ్చి పోలీస్ కమిషనర్ కార్యాలయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అంతర్రాష్ట్ర దర్యాప్తులో భాగంగా అవసరమైన సహకారం మాత్రమే అందిస్తున్నామని చెప్పారు. మోనాలిసా పోలీసు రక్షణ కోరినప్పటికీ, దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మధ్యప్రదేశ్ పోలీసు బృందం కొచ్చిలోనే ఉండి పలుచోట్ల గాలిస్తున్నా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమెను అదుపులోకి తీసుకోవడం కంటే ముందుగా వాంగ్మూలం నమోదు చేసుకోవడమే తమ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. వివాహం జరిగే నాటికి మోనాలిసా వయసు 16 సంవత్సరాల 2 నెలలు మాత్రమేనని, పెళ్లి కోసం నకిలీ జనన ధృవీకరణ పత్రం ఉపయోగించారని జాతీయ గిరిజన కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) నిర్ధారించడంతో ఈ కేసు తీవ్రరూపం దాల్చింది. మధ్యప్రదేశ్‌లోని ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా పుట్టిన తేదీ 2009 డిసెంబర్ 30గా తేలింది. ఈ ఆధారాలతో ఆమె భర్త ఫర్మాన్ ఖాన్‌పై మధ్యప్రదేశ్ పోలీసులు కిడ్నాప్ కేసుతో పాటు పోక్సో చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం తీవ్రత దృష్ట్యా కేరళ, మధ్యప్రదేశ్ డీజీపీలు ఢిల్లీలో తమ ఎదుట హాజరు కావాలని జాతీయ కమిషన్ ఆదేశించింది. చట్టపరమైన, అధికార పరిధికి సంబంధించిన అంశాలు ముడిపడి ఉండటంతో ఈ కేసు దర్యాప్తు క్లిష్టంగా మారింది.

## రాహుల్‌కు స్టాలిన్ కృతజ్ఞతలు

### బీజేపీ కుట్రను భగ్నం చేశామన్న తమిళ సీఎం

చెన్నై: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును లోక్‌సభలో అడ్డుకోవడంలో ప్రతిపక్షాలు ప్రదర్శించిన అసాధారణ ఐక్యతపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. ఇది 'ఇండియా' కూటమి సాధించిన చారిత్రక విజయమని అభివర్ణించారు. ముఖ్యంగా, పార్లమెంటులో ఈ అంశంపై గట్టిగా గళం విప్పిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆయన పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "కేవలం రాజకీయ లబ్ధి కోసం దేశాన్ని ఉత్తర, దక్షిణ రాష్ట్రాలుగా విడదీసేందుకు బీజేపీ పన్నిన కుట్రను 'ఇండియా' కూటమి సమష్టిగా భగ్నం చేసింది. ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా తెచ్చిన ఈ బిల్లును వ్యతిరేకించిన మిత్రపక్షాలన్నింటికీ నా అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించిన రాహుల్ గాంధీతో పాటు సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేరళ సీఎం పినరయి విజయన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు జాతీయ నేతలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
ఆదివారం 19-4-2026, జగిత్యాల | www.evarthalu.com 

## వయ్యారి చిత్రం


నందిని రాయ్

## ఇన్‌ఫ్లూయెన్సర్ కుషితకు సీఎం కోటా ఐపీఎల్ టికెట్లు!





తెలంగాణలో ఐపీఎల్ టికెట్ల పంపిణీ వ్యవహారం కొత్త వివాదానికి తెర తీసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం కేటాయించిన అత్యంత ఖరీదైన 'ఎలైట్ లాంజ్' టికెట్లు.. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్, నటి కుషితా కల్లాపు చేతికి ఎలా వెళ్లాయన్న దానిపై ప్రస్తుతం నెట్టింట తీవ్ర దుమారం రేపుతోంది. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి పేరిట ఇచ్చే ఎలైట్ లాంజ్ టికెట్లతో నటి కుషితా మ్యాచ్ వీక్షించేందుకు వెళ్లారు. అయితే, ఆ టికెట్లపై స్పష్టంగా సీఎం కోసం ఉద్దేశించినవి అని రాసి ఉన్న దృశ్యాలను ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో వీడియో రూపంలో పంచుకోవడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ ఎలైట్ లాంజ్ టికెట్లు ఒక్కోటి సుమారు రూ. 40,000 విలువ చేసే విలువ ఉంటుందని, ఇవి ఆమెకు ఎలా దక్కాయని నెటిజన్‌లు ప్రశ్నిస్తున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి ఇన్ ఫ్లూయెన్సర్లకు టికెట్లు ఎవరు ఇస్తున్నారు, ఎందుకు ఇస్తున్నారంటూ నెటిజన్లు అధికారులను నిలదీస్తున్నారు. ఐపీఎల్ టికెట్లను సీఎంవో దుర్వినియోగం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఎలైట్ లాంజ్ టికెట్లను అధికారులు ఇలా పంచుతున్నారా..? లేక బ్లాక్ మార్కెట్లో ఎవరికైనా అమ్ముకుంటున్నారా? అని నెటిజన్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



## మంగ్లీపై ప్రొడ్యూసర్ కౌన్సిల్‌లో ఫిర్యాదు

ప్రముఖ సింగర్ మంగ్లీ అలియాస్ సత్యవతిపై తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు ప్రొడ్యూసర్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేశారు. మూవీస్‌కు కానీ, ఈవెంట్స్‌కి కానీ అనుమతి ఇవ్వద్దని కోరారు. గిరిజన బిడ్డలను మైక్రో ఫైనాన్స్ పేరుతో మోసాలు చేస్తున్నట్లు మంగ్లీపై ఆరోపణలు ఉన్నాయని, ఆ ఆరోపణలపై పోలీస్ విచారణ ముగిసే వరకు మూవీస్‌లో అవకాశం ఇవ్వవద్దని ఫిర్యాదు చేశారు. బాధితులకు మంగ్లీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని స్పష్టం చేశారు. గత బుధవారం మంగ్లీ మీడియాతో మాట్లాడుతూ.. తాను పేదరికం నుంచి వచ్చానని, డబ్బు విలువ తెలుసునని అన్నారు. నెల రోజులుగా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నానని చెప్పారు. బాధితులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



## బిగ్‌బాస్ నిర్వాహకులకు సోనాల్ షాక్


ప్రముఖ రియాలిటీ షో బిగ్‌బాస్ చుట్టూ వివాదాలు కొత్తేమీ కావు. కానీ, తాజాగా ఒక నటి బిగ్‌బాస్ నిర్వాహకులపై చేసిన ఆరోపణలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. తన ఆరోగ్యాన్ని పాడు చేసినందుకు గాను ఏకంగా రూ. 2 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేయడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ నటి మరెవరో కాదు.. ప్రముఖ మోడల్, నటి సోనాల్ రౌత్. హిందీ బిగ్‌బాస్ సీజన్-8లో కంటెస్టెంట్‌గా పాల్గొని ఫైనల్ వరకు వెళ్లిన సోనాల్ రౌత్‌కు మంచి గుర్తింపు ఉంది. అయితే, ఇటీవల ఆమె బిగ్‌బాస్ మరాఠీ సీజన్-6లో పాల్గొంది. అందరూ ఆమె ఈ షోలో చాలా కాలం ఉంటుందని భావించారు. కానీ కేవలం రెండు వారాలకే ఆమె బయటకు వచ్చేసింది. ఈక్రమంలోనే.. సోనాల్ తన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ చూసి జనాలు షాక్ అవుతున్నారు. తన ఒంటిపై వచ్చిన దద్దుర్లు, మచ్చల ఫోటోలను షేర్ చేస్తూ.. హౌస్‌లోని దారుణమైన పరిస్థితులను బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది.

## పెళ్లి దిశగా శ్రుతిహాసన్



శ్రుతి హాసన్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో తాను మల్టీట్యాలెంటెడ్ బ్యూటీ అని కెరీర్ ఆరంభంలోనే చాటి చెప్పింది. లెజెండ్ కమల్ హాసన్ వారసురాలిగా చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చిన అమ్మడు. అంచలంచెలుగా ఎదిగింది. సౌత్ సహా బాలీవుడ్ లోనూ అనతి కాలంలోనే సినిమాలు చేసి అన్ని పరిశ్రమల్లోనూ తనదైన ముద్ర వేసింది. వ్యక్తిగత జీవితంలోనే శ్రుతిహాసన్ ప్రేమాయణాలు నడపడంలోనూ తక్కువేం కాదని ప్రూవ్ చేసింది. తొలుత విదేశీయుడు మైఖెల్ కోర్సలేతో కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసింది. అతడినే పెళ్లాడాలనుకుంది. ఈ క్రమంలో మైఖెల్ ను డాడ్ కు సైతం పరిచయం చేసింది. కానీ ఎందుకనో ఆ బంధం పెళ్లి వరకూ దారి తీయలేదు.

## రాశీ ఖన్నా ఫుల్ బిజీ!



తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు.

## భాగ్యశ్రీ మాయలో యువత



గ్లామర్ ప్రపంచంలో కేవలం అందం మాత్రమే ఉంటే సరిపోదు.. ఆ అందానికి అభినయం తోడైనప్పుడే అసలైన గుర్తింపు లభిస్తుంది. ఈ సూత్రాన్ని అక్షరాలా నిజం చేస్తోంది యువ నటి భాగ్యశ్రీ బోర్సే. చారెడేసి కళ్లతో మంత్రముగ్ధులను చేసే చూపులతో మాయ చేయగల ప్రతిభ ఈ యువనటి సొంతం. కృత్రిమమైన హంగుల కంటే, క్యూట్‌గా, నేచురల్‌గా కనిపించే భాగ్యం శైలికి తెలుగు యువత ఫిదా అవుతోంది. అందుకే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ భామ పేరే వినిపిస్తూ విపరీతమైన క్రేజ్‌ను సొంతం చేసుకుంటోంది. మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ రూపొందించినమిస్టర్ బచ్చన్ వంటి భారీ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన భాగ్యశ్రీ తన మొదటి ప్రయత్నంలోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని సరసన నటించి తన అద్భుత నటనతో అలరించింది. ఆ సమయంలోనే వీరిద్దరి కెమిస్ట్రీ చూసి రామ్ సైతం ఈ బ్యూటీకి పడిపోయాడనే ప్రచారం జరుగుతోంది. వృత్తిపరంగా ఇద్దరూ తమ తమ దారుల్లో దూసుకుపోతున్నారు. వరుస అవకాశాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఇండస్ట్రీలో ఏర్పరచుకుంటోంది. భాగ్యశ్రీ సోషల్ మీడియా ఫాలోయింగ్ చూస్తుంటే తన రేంజ్ ఏంటో అర్థమవుతుంది. ఈ బ్యూటీ షేర్ చేసే ప్రతి పోస్ట్ నిమిషాల వ్యవధిలోనే వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో వైరల్ అవుతోంది. కేవలం ఫోటోలు మాత్రమే కాకుండా, తన డ్రెస్సింగ్ సెన్స్, మేకప్ శైలి కూడా నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. అతిగా కాకుండా చాలా నేచురల్‌గా ఉంటూనే ఎంతో ఆకర్షణీయంగా కనిపించే తీరు నేటి తరం హీరోయిన్లలో ఒక సోషల్ మీడియా క్వీన్ గా నిలబెట్టింది. ప్రస్తుతం ఈ భామ అక్కినేని అఖిల్ సరసన నటిస్తున్న లెనిన్ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.

## బాలీ రిసార్టులో మాళవిక



తెలుగు చిత్రసీమలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన హీరోయిన్ మాళవిక మోహనన్ తన తాజా సోషల్ మీడియా పోస్టులతో కుర్రకారును ఆకట్టుకుంటోంది. అందమైన బులుగు రంగు సముద్రం, బీచ్ అంచున వేలాడుతున్నట్టుగా ఉన్న రిసార్టులలో ఈ భామ ప్రకృతిని ఆస్వాధిస్తూ కనిపిస్తోంది. ముఖ్యంగా బాలీలోని లగ్జరీ రిసార్టులకు ప్రమోషన్ చేస్తూ మాళవిక షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ.. షూటింగ్ విరామాల్లో విదేశీ తీర ప్రాంతాల్లో సేదతీరుతూ తన ఫాలోవర్లకు కొత్త ట్రావెల్ గోల్స్ ఇస్తోంది. సినిమా ఫలితాల విషయానికొస్తే, ఈ భామకు ఇటీవల కాలం పెద్దగా కలిసి రావడం లేదనే చెప్పాలి. సూర్య సరసన నటించిన కంగువ వంటి భారీ బడ్జెట్ చిత్రం ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. ఇక ప్రభాస్ సరసన నటించిన రాజా సాబ్ కూడా ఊహించని విధంగా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. సాధారణంగా అగ్ర హీరోల సరసన నటించిన సినిమాలు ఫ్లాప్ అయితే హీరోయిన్లు బెంగ పెట్టుకుంటారు.. కానీ ఈ ప్రభాస్ బ్యూటీ మాత్రం గెలుపోటములతో సంబంధం లేకుండా జీవితాన్ని నచ్చినట్టు ఆస్వాధిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం మాళవిక తన తదుపరి ప్రాజెక్టులపై గట్టి ఆశలే పెట్టుకుంది. కార్తీ సరసన నటిస్తున్న సర్దార్ 2 ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ యాక్షన్ డ్రామా తన కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తుందని భావిస్తోంది. దీనితో పాటు పాకెట్ నవలఅనే మరో ఆసక్తికరమైన చిత్రంలోనూ నటిస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఉన్నా.. నిరంతరం సోషల్ మీడియా ప్రమోషన్స్.. వెకేషన్స్ తో అభిమానులకు టచ్‌లో ఉంటూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది.







# హీరో.. ప్రఫుల్

## హైదరాబాద్‌ను గెలిపించిన బౌలర్

**ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఉప్పల్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. బ్యాటింగ్‌లో అభిషేక్, క్లాసెన్ సత్తా చాటితే.. బౌలింగ్‌లో ఇషాన్ మలింగా, నితీష్ రెడ్డి, ప్రఫుల్ హింగే నిప్పులు చెరిగారు.**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(22 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59), హెన్రీచ్ క్లాసెన్(39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీలతో రాణించారు. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్(3/22), జెమీ ఓవర్టన్(3/37) మూడేసి వికెట్లు తీయగా..ముఖేష్ చౌదరి(2/21) రెండు వికెట్లు పడగొట్టాడు. గుర్జప్నీత్ సింగ్(1/34) ఒక వికెట్ దక్కింది. అనంతరం సీఎస్‌కే 20 ఓవర్లలో 8 వికెట్లకు 184 పరుగులే చేసి ఓటమిపాలైంది.

ఆయుష్ మాత్రే(13 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 30), మాథ్యూ షార్ట్(30 బంతుల్లో 3 ఫోర్లతో 34) టాప్ స్కోరర్లుగా నిలిచారు. శివమ్ దూబే(16 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21) దూకుడుగా ఆడినా ఫలితం లేకపోయింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఇషాన్ మలింగా(3/29) మూడు వికెట్లు తీయగా.. నితీష్ కుమార్ రెడ్డి(2/19) రెండు వికెట్లు పడగొట్టాడు. శివాంగ్ కుమార్(1/18), సాకిబ్ హుస్సేన్(1/32), ప్రఫుల్ హింగే(1/60) చెరో వికెట్ తీసారు. 195 పరుగుల లక్ష్య ఛేదనలో సంజూ శాంసన్(7) త్వరగానే ఔటైనా.. ఆయుష్ మాత్రే దూకుడుగా ఆడాడు. నితీష్ కుమార్ రెడ్డి తన వరుస ఓవర్లలో ఆయుష్ మాత్రే, రుతురాజ్ గైక్వాడ్(19)లను ఔట్ చేసినా సీఎస్‌కే పవర్ ప్లేలో 76 పరుగులు చేసింది. ఆచితూచి ఆడిన సర్ఫరాజ్ ఖాన్, మాథ్యూ షార్ట్ జోడీని ఇషాన్ మలింగా విడదీసాడు. సర్ఫరాజ్ ఖాన్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే డేంజరస్ డెవాల్డ్ బ్రేవిస్(0)ను శివాంగ్ కుమార్ క్యాచ్ ఔట్ చేశాడు. ఈ పరిస్థితుల్లో శివమ్ దూబే, మాథ్యూ షార్ట్‌లు ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కానీ మాథ్యూ షార్ట్(34)ను మలింగా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. శివమ్ దూబే(21)ను హుస్సేన్ క్లీన్



బౌల్డ్ చేయగా.. అన్షుల్ కంబోజ్ భారీ సిక్సర్‌తో మ్యాచ్‌పై ఉత్కంఠగా మార్చాడు. ఆఖరి ఓవర్‌లో సీఎస్‌కే విజయానికి 18 పరుగులు అవసరం కాగా.. ప్రఫుల్ హింగే.. జెమీ ఓవర్టన్(16)ను ఔట్ చేసి సన్‌రైజర్స్ విజయాన్ని లాంఛనం చేశాడు. తొలి 3 ఓవర్లలో 53 పరుగులిచ్చిన ప్రఫుల్ హింగే.. ఆఖరి ఓవర్‌లో కేవలం 7 పరుగులు మాత్రమే ఇచ్చాడు. రాజస్థాన్ రాయల్స్‌తో గత మ్యాచ్‌లోనూ ప్రఫుల్ హింగే మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే.




## బౌలర్లపై హార్దిక్ అసహనం: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. జట్టులో స్టార్ క్రికెటర్లకు కొదవ లేకున్నా విజయాలు మాత్రం దక్కడం లేదు. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ముంబై ఓటమిపాలైంది. పంజాబ్ కింగ్స్‌తో ఓటమి అనంతరం ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. అసలేం మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని, చెప్పడానికి కూడా ఏమి లేదన్నాడు. అలా హార్దిక్ పాండ్యా ఎందుకు అన్నాడో మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విశ్లేషించాడు. బౌలర్ల పేలవ ప్రదర్శన నేపథ్యంలోనే హార్దిక్ ఈ వ్యాఖ్యలు చేశాడని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు.

అందుకే హార్దిక్ అలా అన్నాడు.. 'పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం హార్దిక్ పాండ్యా చెప్పడానికి ఏం లేదన్నాడు. నిజాయితీగా చెప్పాలంటే అతని దగ్గర ఎలాంటి సమాధానాలు లేవు. గత మ్యాచ్‌లో కొన్ని ఓవర్లలో 20 పరుగుల కంటే ఎక్కువ సమర్పించుకున్నామని హార్దిక్ తెలిపాడు. అయితే ప్రస్తుత ఫార్మాట్‌కు ఈ మాటలు ఏ మాత్రమ అమోదయోగ్యం కాదు. ఈ రోజుల్లో 190 పరుగులు చాలా తక్కువ. పంజాబ్‌పై 190ం లక్ష్యం నమోదు చేసిన ముంబై.. 20 పరుగులు తక్కువగా చేసింది. ఇది స్లో పిచ్ అని, 240 పరుగులు చేయడం కష్టమని హెడ్ కోచ్ జయవర్ధనే అభిప్రాయపడ్డాడు. అయితే ఈ పిచ్‌పై 240 చేయకున్నా.. 220-230 పరుగులు చేయవచ్చు. అయితే 230 చేసినా ముంబై గెలిచే స్థాయిలో లేదు. 190ం లక్ష్యం ఉన్నప్పుడే దీపక్ చాహర్ తన తొలి ఓవర్‌లో 21 పరుగులు ఇచ్చుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా కూడా అంతే. తర్వాత స్పెల్‌లో బుమ్రా-ఘజన్‌ఫర్ కాస్త కట్టడి చేయగలిగారు. మళ్లీ ఎప్పుడైతే దీపక్ చాహర్ వచ్చాడో.. మ్యాచ్ నుంచి ముంబై దూరమైంది. జస్‌ప్రీత్ బుమ్రా వైఫల్యం కూడా ముంబైపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అతను ఒక్క వికెట్ కూడా తీయలేదు. ట్రెంట్ బౌల్ట్ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శార్దూల్ ఠాకూర్ వికెట్ తీసినా.. అతను చాలా రిస్క్ బౌలర్. ఘజన్‌ఫర్ ఒక్కడు పర్వాలేదనిపించాడు. మిచెల్ సాంట్నర్ కూడా ఇబ్బంది పడ్డాడు. ముంబై ఈ సమస్యల నుంచి ఎలా బయటపడుతుందో చూడాలి. బౌలింగ్ గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. బంతితో రాణించడం మినహా మరే సమాధానం లేదు.'అని అశ్విన్ విశ్లేషించాడు.




## త్వరలో సీఎస్కే కెప్టెన్‌గా సంజూ: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆరంభంలో వరుస పరాజయాలతో ఇబ్బంది పడినప్పటికీ వరుసగా రెండు విజయాలు సాధించి సీఎస్‌కే గాడిన పడింది. కానీ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ మాత్రం పూర్తిగా విఫలమవుతున్నాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ సీఎస్‌కే కెప్టెన్సీ విషయమై సంచలన వ్యాఖ్యలు చేశాడు. సంజూ శాంసన్ సీఎస్‌కేకు కొత్త కెప్టెన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నాడు. అది ఈ సీజన్ మధ్యలోనే జరిగే అవకాశముందని కూడా అభిప్రాయపడ్డాడు. ఒకవేళ ఈ సీజన్‌లో కాకపోయినా భవిష్యత్తులో మాత్రం శాంసన్ సీఎస్‌కేను శాసిస్తాడని జోస్యం చెప్పాడు. ప్రస్తుతం వరుస పరాజయాలతో సతమతమవుతున్న సీఎస్‌కేకు కెప్టెన్సీ అనుభవం ఉన్న ఆటగాడు అవసరమని, ఈ విషయంలో సీఎస్‌కేకు మొదటి చాయిస్ సంజూనే అని తెలిపాడు. ఇప్పటికే సంజూ శాంసన్ రాజస్తాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు ఫైనల్ చేర్చినట్లు గుర్తుచేశాడు. దీంతో సీఎస్‌కే యాజమాన్యం ఈ సీజన్ మధ్యలోనే రుతురాజ్‌ను తప్పించి శాంసన్‌కు బాధ్యతలు అప్పగించినా ఆశ్చర్యపోనవసరం లేదని తెలిపాడు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న రుతురాజ్ ఈ సీజన్‌లోనే కెప్టెన్సీ వదిలేసే అవకాశాలు కూడా ఉన్నాయని జోస్యం చెప్పడం గమనార్హం. ప్రస్తుతం అశ్విన్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ఎంఎస్ ధోని సారథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్ ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ధోని కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాక సీఎస్‌కే ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ధోని తర్వాత కెప్టెన్లు ఎందరు మారినా సీఎస్‌కే మరో టైటిల్ కొట్టడంలో మాత్రం విఫలమయ్యింది.

## మిడిల్ ఆర్డర్ వల్లే ఓడం: రుతురాజ్

మిడిల్ ఓవర్లలో బ్యాటింగ్ వైఫల్యమే తమ ఓటమికి ప్రధాన కారణమని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. ముఖ్యంగా 11, 12వ ఓవర్లలో 4 పరుగులే చేయడం తమ పతనాన్ని శాసించిందని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా శనివారం ఉప్పల్ స్టేడియం వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై గెలుపొందింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రుతురాజ్ గైక్వాడ్.. ఇదే విషయాన్ని ప్రస్తావించాడు. 'ఇది సునాయసంగా ఛేదించాల్సిన లక్ష్యం. అయితే పవర్ ప్లేలో మా బౌలింగ్ చూసి సన్‌రైజర్స్ హైదరాబాద్ సునాయసంగా 220-230 పరుగులు చేస్తుందని అనుకున్నా. కానీ మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి 30 పరుగులు తక్కువే ఇచ్చారు. ఇలాంటి మైదానంలో 200 పరుగుల లక్ష్యం ఛేదించడం కష్టం కాదు. ఒక దశలో మా విజయానికి 10 ఓవర్లలో 80 పరుగులే అవసరమయ్యాయి. అలాంటి పరిస్థితుల్లో మేం భాగస్వామ్యాలు నెలకొల్పాల్సింది. తద్వారా ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి తేవాల్సింది. కానీ ఆ తర్వాతి రెండు ఓవర్లు మ్యాచ్ గమనాన్ని మార్చేసాయి. 11, 12వ ఓవర్లలో మేం కేవలం 4 పరుగులు మాత్రమే చేశాం. ఇది మా ఓటమిని శాసించింది. డెత్ ఓవర్లలో ఓవర్‌కు 12, 13 పరుగులు చేయడం కష్టమని మాకు తెలుసు. ఆఖర్లో సన్‌రైజర్స్ బౌలర్లు చాలా అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఈ గెలుపు క్రెడిట్ వారికే దక్కుతుంది. గత మూడు మ్యాచ్‌లుగా మేం బౌలింగ్‌లో బాగా రాణిస్తున్నాం.




## బాధ తీరింది: డేవిడ్ మిల్లర్

గత కొన్ని రోజులుగా తనను వెంటాడుతున్న బాధ తీరిందని ఢిల్లీ క్యాపిటల్స్ విధ్వంసకర బ్యాటర్ డేవిడ్ మిల్లర్ అన్నాడు. గుజరాత్ టైటాన్స్ చేతిలో తమ జట్టు ఓటమికి కారణమయ్యాననే బాధ తనను కలిచి వేసిందని తెలిపాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను గెలిపించినందుకు సంతోషంగా ఉందని, తనకు ఇప్పుడు ప్రశాంతంగా ఉందని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఆర్‌సీబీతో శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. డేవిడ్ మిల్లర్(10 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 22 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్‌తో ఢిల్లీకి చిరస్మరణీయమైన విజయాన్నందించాడు. ఆఖరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 15 పరుగులు అవసరం కాగా.. రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో వరుసగా 6,6,4 బాది మరో బంతి మిగిలి ఉండగానే మిల్లర్ మ్యాచ్‌ను ముగించాడు. అయితే గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఇలాంటి పరిస్థితుల్లోనే డేవిడ్ మిల్లర్ ఆఖరి 2 బంతులకు పరుగులు చేయలేక కుల్దీప్ యాదవ్‌తో సింగిల్‌కు నిరాకరించి ఓటమికి కారణమయ్యాడు. తాజా విజయంతో ఆ తప్పిదానికి మిల్లర్ బదులు తీర్చుకున్నాడు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన డేవిడ్ మిల్లర్ సంతోషంగా ఉందని, తనను వెంటాడుతున్న బాధ తీరిందని చెప్పుకొచ్చాడు. 'చాలా సంతోషంగా ఉంది. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేయలేకపోయాననే బాధ నన్ను వెంటాడింది. కానీ మళ్ళీ అలాంటి స్థితిలోనే ఉండి మ్యాచ్ గెలిపించడం చాలా సంతోషంగా ఉంది. మరో మ్యాచ్ గెలిచే వరకు పాత ఓటమి జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉంటాయి. మాకు ఒక వారం విరామం లభించింది. ఈ సమయంలో నేను కొన్ని విషయాలను సరిచేసుకున్నాను. ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణంపై ఫోకస్ పెట్టి నా శక్తిమేర ప్రయత్నించాను. యార్కర్లు కావడంతో ఆడలేకపోయా.. నేను ఎదుర్కొన్న తొలి 6 బంతులు నమ్మశక్యం కాని విధంగా ఉన్నాయి. అవి ఆరు యార్కర్లు కావడంతో నేను పరుగులు తీయలేకపోయాను. కానీ చివరి 6 బంతుల్లో అది సాధ్యమైనందుకు చాలా సంతోషంగా ఉంది. మేం రెండో చివరి ఓవర్లోనే మ్యాచ్ ముగించాలని ప్రయత్నించాం. చివరి నాలుగు ఓవర్లలో 43 పరుగులు కావాల్సినప్పుడు ఒకటి రెండు సిక్సర్లు వస్తాయని తెలుసు. వరుసగా బౌండరీలు బాదితే ఏ బౌలర్ అయినా ఒత్తిడిలోకి వెళ్తాడు. అందుకే డాట్ బాల్స్ తగ్గించి, బౌండరీ బాల్ వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయత్నించాం. ప్రశాంతంగా ఉంటూ మ్యాచ్‌ను వీలైనంత చివరి వరకు తీసుకెళ్లాలనుకున్నాం.



ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 19-4-2026, జగిత్యాల




# రియల్ లైఫ్..!



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, 9581291919

లైకుల కోసం ఆరాటం..
కామెంట్ల కోసం పోరాటం..
షేరింగుల కోసం తండ్లాట..
ఫాలోవర్ల కోసం తాపత్రయం..
వ్యూస్ కోసం వయ్యారాలు..
రీపోస్టుల కోసం స్టంట్లు..
ఇవీ.. రీల్ లైఫ్ ఆపసోపాలు..
రియల్ లైఫ్‌లోకి రా గురూ..!

రీ-టేకులుంటాయి..
ఎడిటింగులుంటాయి..
ఫొటో ఫిల్టర్లుంటాయి..
గ్లాసీ ఎఫెక్టులుంటాయి..
కానీ, ఫోన్ పక్కన పెడితే..
మాయమయ్యే స్వర్గమది!!

క్షణక్షణం కన్నీటి సాంగత్యం..
సమయంలేని సవాళ్ల స్వాగతం..
బుక్కెడు బువ్వ కోసం హాహాకారం..
తప్పదు కష్టాల కలికాలం..
ఫోన్ పక్కన పెడితే..
మన నిత్య జీవితమిది!!

అందమైన అబద్ధపు మాయలో
కావొద్దు 'అంగడి బొమ్మ'లా!
కటిక చేదు నిజమైనా..
కాదనొద్దు అదే అసలైన జీవితం!!

నేటి ఆధునిక సమాజం అరచేతిలోని స్మార్ట్‌ఫోన్‌లో బందీ అయిపోయింది. సాంకేతికత మనిషి జీవనశైలిని సులభతరం చేయాల్సింది పోయి, ప్రాణాల మీదకు తెస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావం ఎంతలా పెరిగిపోయిందంటే.. కళ్ళ ముందున్న 'నిజమైన' జీవితం కంటే, స్క్రీన్ మీద కనిపించే 'నిర్జీవమైన' ప్రపంచమే అద్భుతం అని నమ్మే స్థాయికి మనిషి దిగజారిపోయాడు. ఈ క్రమంలో రీల్ లైఫ్‌కు, రియల్ లైఫ్‌కు మధ్య ఉన్న తేడాను గమనించలేక ఎందరో తమ బంగారు భవిష్యత్తును, పచ్చని సంసారాలను బూడిద చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో మనం చూసే ప్రతి ఒక్కటి నిజం కాదు. వడపోసిన అందం, అద్దెకు తెచ్చిన ఆడంబరం, కేవలం కొన్ని సెకన్ల వినోదం కోసం చేసే నటన మాత్రమే అక్కడ కనిపిస్తుంది. కానీ, సామాన్య ప్రజలు, ముఖ్యంగా యువత, గృహిణులు ఆ మెరుపులను చూసి అది నిజమైన జీవితం అని భ్రమపడుతున్నారు. ఆ రీల్స్‌లో కనిపించే జంటల మధ్య ఉన్న కృత్రిమ ప్రేమను చూసి, తమ నిజ జీవితంలో ఉన్న భర్త లేదా భాగస్వామిపై అసంతృప్తి పెంచుకుంటున్నారు. ఫలితంగా, అప్పటివరకు ఎంతో అన్యోన్యంగా ఉన్న కుటుంబాల్లో చిచ్చు రేగుతోంది. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో పరిచయమైన అపరిచితుల కోసం కట్టుకున్న భర్తను, కన్నబిడ్డలను వదిలి వెళ్తున్న ఉదంతాలు నిత్యం వార్తల్లో చూస్తున్నాం. ఫేస్‌బుక్ లైక్‌లు, ఇన్‌స్టాగ్రామ్ కామెంట్లతో మొదలైన పరిచయం.. చివరకు ప్రాణాల మీదకు తెస్తోంది. అవతలి వ్యక్తి అసలు రంగు తెలియకుండా, కేవలం ఆకర్షణకు లోనై పచ్చని సంసారాన్ని రోడ్డున పడేస్తున్నారు. ఇలా వెళ్లిపోయిన మహిళలు చివరకు మోసపోవడమో లేదా హత్యలకు గురికావడమో జరుగుతోంది. క్షణికానందం కోసం జీవితాంతం తోడుండే బంధాన్ని కాలదన్నడం ఎంతటి అవివేకమో అర్థం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

యువత పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. ఏదైనా సాధించాలనే తపన కంటే, ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్ని వ్యూస్ వచ్చాయి, ఎంతమంది ఫాలోవర్లు పెరిగారన్నదే వారికి ప్రాధాన్యంగా మారింది. గంటల తరబడి రీల్స్ చూస్తూ కాలక్షేపం చేయడం వల్ల సృజనాత్మకత నశిస్తోంది. చదువుపై ఏకాగ్రత తగ్గి, మొబైల్ ఫోనే ప్రపంచంగా బతుకుతున్నారు. రీల్స్‌లో ఫేమస్ అవ్వడం కోసం ప్రాణాలకు తెగించి స్టంట్లు చేయడం, అసభ్యకరమైన వీడియోలు చేయడం వంటివి సామాజిక విలువల పతనాన్ని సూచిస్తున్నాయి. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ప్రలోభాలకు లోనై యువత విచ్చలవిడిగా ఖర్చు చేస్తోంది. బ్రాండెడ్ వస్తువులు, ఖరీదైన మేకప్ కిట్లు, లగ్జరీ లైఫ్ స్టైల్ ప్రదర్శించాలనే తాపత్రయంలో లక్షల రూపాయలు అప్పులు చేస్తున్నారు. ఈ క్రెడిట్ కార్డ్ సంస్కృతి, అనవసరపు షాపింగ్ మోజు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక వెన్నెముకను విరుస్తోంది. అవసరం కోసం కొనే స్థాయి నుండి, లోకానికి చూపించడం కోసం కొనే స్థాయికి మనిషి మారిపోయాడు.

సాంకేతిక విప్లవం మనిషిని ప్రపంచానికి దగ్గర చేయాల్సింది పోయి, తన వాళ్లకు దూరం చేస్తోంది. ఒకప్పుడు కష్టసుఖాలను పంచుకోవడానికి మనుషులు ఉండేవారు, ఇప్పుడు కేవలం 'స్టేటస్'లు మాత్రమే ఉంటున్నాయి. ఈ సోషల్ మీడియా వ్యామోహం ఒక సామాజిక వ్యాధిలా ప్రబలుతోంది. సోషల్ మీడియాలో ఇతరుల విలాసవంతమైన జీవితాలను చూసి, తమ జీవితం వ్యర్థమని భావించే 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్' (న్యూనతా భావం) పెరిగిపోతోంది. పక్కింటి వ్యక్తి కొత్త కారు కొన్నా, ఎవరో విదేశీ యాత్రకు వెళ్లినా.. అది చూసి కుమిలిపోతూ, ఇంట్లో గొడవలు పడే జంటల సంఖ్య పెరుగుతోంది. తిన్న తిండి నుండి, పడుకునే పడకగది వరకు ప్రతి విషయాన్ని రీల్స్ రూపంలో ప్రపంచానికి చూపించాలనే తాపత్రయంలో వ్యక్తిగత గోప్యత కరువవుతోంది. ఇది నేరగాళ్లకు సులభమైన అవకాశంగా మారుతోంది. నిజ జీవితంలో గుర్తింపు లేని వారు, సోషల్ మీడియాలో ఫాలోవర్ల కోసం పాకులాడుతున్నారు. ఆ ఫాలోవర్లు ఇచ్చే 'లైక్'లే తమ జీవిత పరమార్థం అనుకుని, అవి తగ్గగానే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

నిజమైన సంతోషం లైక్‌లలో లేదు, తోటి మనుషుల ప్రేమలో ఉంది. ఫోన్ పక్కన పెట్టి కన్నవారితో, కట్టుకున్న వారితో మాట్లాడితే దొరికే ప్రశాంతత వేల రీల్స్ చూసినా దొరకదు. సోషల్ మీడియాను సమాచారానికి, పరిమిత వినోదానికి మాత్రమే వాడాలి. అది మన జీవితాలను శాసించే స్థాయికి వెళ్లకూడదు. జీవితం అంటే ఓ అద్భుతమైన అవకాశం. దాన్ని కేవలం డిజిటల్ తెరపై వెతుక్కోవద్దు. రీల్స్ వెనుక ఉన్నది నటన, రియాలిటీలో ఉన్నది బతుకు పోరాటం. ఈ రెండింటి మధ్య గీతను దాటితే వినాశనం తప్పదు. ఇప్పటికైనా సోషల్ మీడియా మత్తు నుండి బయటకు వచ్చి, బాధ్యతాయుతమైన పౌరులుగా, ప్రేమగల కుటుంబ సభ్యులుగా మెలగడమే మనందరి బాధ్యత. 'నిజమైన' జీవితాన్ని ప్రేమిద్దాం.. 'నిర్మిత'

## కళ్లు తెరవాల్సిందే..

- ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఒక మహిళ ఇన్ స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి కోసం తన ఇద్దరు పసిపిల్లలను, కట్టుకున్న భర్తను వదిలేసి వెళ్లిపోయింది. తీరా వెళ్ళాక ఆ వ్యక్తి ఆమెను శారీరక వేధింపులకు గురిచేసి, ఆమె దగ్గరున్న నగలతో ఉడాయించాడు. ఇప్పుడు ఆమె అటు భర్త దగ్గరకు వెళ్లలేక, ఇటు పిల్లలను చూడలేక రోడ్డున పడింది.
- కేరళలో ఒక యువతి సోషల్ మీడియాలో చూసిన ఖరీదైన దుస్తులు, వస్తువులు కొనడానికి లక్షల రూపాయలు అప్పు చేసింది. అప్పులు తీర్చే మార్గం లేక, ఆడంబరంగా బతకలేక చివరకు తనువు చాలించింది. గ్లామర్ ప్రపంచం వెనుక ఉన్న అప్పుల ఊబిని ఆమె గమనించలేకపోయింది.
- రైల్వే ట్రాక్‌ల పక్కన, వేగంగా వెళ్లే రైలు ముందు రీల్స్ చేస్తూ ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. నిజామాబాద్ ప్రాంతంలో ఒక యువకుడు రైలు పట్టాలపై రీల్ చేస్తుండగా రైలు ఢీకొట్టి గాల్లోకి ఎగిరి పడి మరణించిన దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.
- సోషల్ మీడియాలో పరాయి వ్యక్తులతో చాటింగ్ చేస్తూ దొరికిపోయిన భార్యాభర్తల గొడవలు పోలీస్ స్టేషన్లకు, విడాకుల కోర్టులకు చేరుతున్నాయి. ఒక సర్వే ప్రకారం, ఈ మధ్య కాలంలో జరుగుతున్న విడాకుల్లో 40% వివాదాలకు సోషల్ మీడియా పరిచయాలే కారణమని తేలింది.

## చట్టం ఏమంటోంది..

గతంలో 'అడల్టరీ' (వ్యభిచారం) నేరంగా పరిగణించినా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అది ఇప్పుడు నేరం కాదు. కానీ, సోషల్ మీడియా పరిచయాల వల్ల భర్తను లేదా భార్యను వదిలేసి వెళ్లడం 'విడాకులకు' బలమైన కారణం అవుతోంది. సెక్షన్ 498-ఏ దుర్వినియోగం అవుతోంది. సోషల్ మీడియా మోజులో పడి భర్తను వదిలేసి, తిరిగి అతనిపైనే అక్రమ కేసులు పెట్టే ధోరణి పెరిగింది. ఇలాంటి తప్పుడు కేసులు నిరూపితమైతే ఎదురు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పరాయి వ్యక్తి కోసం పిల్లలను వదిలి వెళ్లే తల్లులకు లేదా తండ్రులకు కోర్టులు పిల్లల సంరక్షణ బాధ్యతను అప్పగించడానికి నిరాకరిస్తాయి. రీల్స్ కోసం అసభ్యకరమైన దుస్తులు ధరించడం, బూతు మాటలు మాట్లాడటం లేదా ఇతరుల వ్యక్తిగత ఫోటోలను అనుమతి లేకుండా వాడటం ఐటి చట్టం - 2000 ప్రకారం నేరం. సోషల్ మీడియాలో అశ్లీలతను ప్రచారం చేస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా పడుతుంది. రీల్స్‌లో కనిపించే తప్పుడు ప్రకటనలను చూసి మోసపోతే వినియోగదారుల రక్షణ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చు. అలాగే, రీల్స్ గుర్తింపు కోసం అప్పులు చేసి ఎగ్గొట్టడం 'చీటింగ్' (సెక్షన్ 420) కిందకు వస్తుంది.

## సోషల్ మీడియా గణాంకాలు

- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, వివిధ న్యాయ నివేదికల ప్రకారం, భారతదేశంలో పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న విడాకులలో దాదాపు 40% వివాదాలకు సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన పరాయి పరిచయాలే కారణమవుతున్నాయి. 2025లో కేవలం ఎనిమిది నెలల కాలంలోనే ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో సుమారు 492 పైగా ఇలాంటి ఫిర్యాదులు నమోదయ్యాయి.
- 2025లో భారతదేశంలో సైబర్ నేరాలు 24% పెరిగాయి. మొత్తం 28.15 లక్షల కేసులు నమోదవ్వగా, భారతీయులు దాదాపు రూ. 22,495 కోట్లు నష్టపోయారు. ఇందులో ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు (76%), హనీ ట్రాపింగ్, మరియు సెక్స్‌టార్షన్ వంటివి ప్రధానంగా ఉన్నాయి.
- ఇండియన్ సైకియాట్రీ సొసైటీ (2022) సర్వే ప్రకారం, 15 నుండి 25 ఏళ్ల మధ్య ఉన్న యువతలో 60% మంది సోషల్ మీడియా వల్ల ఆందోళన, 'ఫోమో' సమస్యలతో బాధపడుతున్నారు.
- తెలంగాణాలో సైబర్ క్రైమ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది (2023లో 18,236 కేసులు). ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ మీడియా దుర్వినియోగంపై 2026 ఏప్రిల్ నాటికి సుమారు 1,549 కేసులు నమోదయ్యాయి.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.